ప్రజా గళమే
# స్పంద
సత్యానికి స్వరం
జాతీయ తెలుగు దినపత్రిక
PRAJA GALAME SPANDA
RNI No. APMUL/26/A3106
బుధవారం || 23-9-2026 || సంపుటి: 1 || సంచిక: 51 || పేజీలు: 8 || వెల : రూ.5/-
Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal

## జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం



వివరాలు 8లో






## కళ్యాణంలో కనువిందు!



3

## పునర్జన్మ రహితం.. రథోత్సవం!

3

- ఉభయ దేవేరులతో కలిసి విహరించిన మలయప్ప
- మాడ వీధుల్లో అడుగడుగునా కర్పూర హారతులు
- రథంపై కేశవుని దర్శనంతో జన్మ ధన్యమన్న పండితులు
- ఉపనిషత్తుల సారాంశాన్ని గుర్తుచేసే ఆధ్యాత్మిక ఘట్టం



## పూర్తి వందేమాతరంపై అభ్యంతరం!



### జాతీయ హోదా, భద్రత కల్పిస్తూ సవరణపై సుప్రీంలో సవాల్
### 6 పాదాల పూర్తి గేయం ఆలపించడంపై రిట్ పిటిషన్

- లౌకికవాదానికి విరుద్ధమని పిటిషనర్ టీఎం కృష్ణ వాదన
- మతపరమైన కారణాలతో పాడకుంటే రక్షణ కల్పించాలన్న కోర్టు
- బిజో ఎమ్మాన్యుయెల్ తీర్పును ప్రస్తావించిన వైనం

4

## పట్టపగలే దోపిడీ!

- క్యాన్సర్ మందు ధరపై సుప్రీంకోర్టు ఆందోళన
- తయారీ, ఎంఆర్‌పీ మధ్య భారీ వ్యత్యాసం
- ఎంఆర్‌పీల ముద్రణలో పకడ్బందీ నిబంధనలు కరువు
- లోపాలను కోర్టుకు వివరించిన పిటిషనర్ కిషన్ చంద్

4

## ఆ నోటీసులకు కారణమేంటి?



ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

4





# వీకెండ్ ఎకానమీ పెరగాలి

## పట్టణాల రూపురేఖలు మార్చేలా భారీ నిధులు

- 11,359 కోట్లతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు
- కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం
- ఆదాయంలో 61 శాతం వారాంతాల్లోనే ఖర్చు
- అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పట్టణాభివృద్ధి శాఖ
- కుప్పం సభలో అధికారులకు సీఎం దిశానిర్దేశం

**కుప్పం, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** పట్టణాలే అభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల రూపురేఖలు మార్చేలా 11359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంగళవారం కుప్పం నుంచి వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఇంత భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి మున్సిపల్ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించామన్నారు. 2 ఏళ్లుగా సంక్లిష్ట పరిస్థితులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు.

పట్టణ ప్రాంతాలు ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజిన్లుగా మారేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పట్టణాల్లో లివబిలిటీ మెరుగుపడటంతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేయాలని చెప్పారు. పట్టణాల్లో వీకెండ్ ఎకానమీ విపరీతంగా పెరుగుతోందని, ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో 61 శాతం డబ్బును వారాంతాల్లో ఖర్చు పెడుతున్నారని వివరించారు. రవాణా

మిగతా 2 లో



## కుప్పానికి కృష్ణా జలాలు!

2

- కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన సీఎం
- ప్రతి చెరువుకూ నీరందించడమే లక్ష్యం
- నియోజకవర్గంలో పండుగ వాతావరణం

## టీచర్ల జోలికొస్తే దబిడి దిబిడే!

### జగన్‌కు లోకేశ్ స్ట్రాంగ్ వార్నింగ్

- మెగా డీఎస్సీపై చర్చకు సిద్ధమా అని సవాల్
- రాప్తాడు సభలో లోకేశ్ భావోద్వేగం



2



## రాజకీయాలకు, పెళ్లికి లింకొద్దు!

తప్పుడు ప్రచారాలపై వైఎస్ షర్మిల ఆగ్రహం

3

## భారీ వర్ష సూచన!

- విశాఖకు 270 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం
- ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సర్కారు వార్నింగ్
- నిరంతరం సమన్వయం చేసుకోవాలన్న మంత్రి
- వాగులు, కాజ్‌వేల వద్ద రాకపోకల నియంత్రణ

2



**అమరావతి, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలోని వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బంగాళాఖాతంలో నెలకొన్న పరిస్థితులను, వాయుగుండం కదలికలను ఆమె ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదని, తమ బోట్లు, వలలను

మిగతా 2 లో

## మళ్లీ నంది అవార్డులు!

- 2026 డిసెంబర్‌లోగా అవార్డులన్నీ అందజేత
- రాష్ట్ర కార్పొరేషన్ ద్వారా కళాకారులకు సత్కారం
- మంత్రి కందుల దుర్గేష్



2

స్పంద

బుధవారం, 23 సెప్టెంబర్ 2026



# భారీ వర్ష సూచన!

(మొదటిపేజీ తరువాయి..)

సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్త పరుచుకోవాలని కోరారు.

విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వాయుగుండం తీవ్రతను హోంమంత్రికి వివరిస్తూ, ఇది ప్రస్తుతం ఒడిశాలోని గోపాల్‌పూర్ కు 180 కిలోమీటర్లు, కళింగపట్నానికి 180 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 270 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపారు. ఈ వాయుగుండం రేపు రాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజాము సమయంలో విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, రానున్న 3 రోజులు అత్యంత కీలకమైనందున ప్రభావిత జిల్లాల యంత్రాంగం హై అలర్ట్ లో ఉండాలని ఆదేశించారు.

ముందస్తు సహాయక చర్యల కోసం ప్రభావిత జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వాయుగుండం తీవ్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలని, విపత్తుల నిర్వహణ సంస్థతో పాటు ఆర్టీజీఎస్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101 లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. పొంగిపొర్లుతున్న వాగులు, కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించాలన్నారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున చెట్లు, హోర్డింగ్‌లు, పాతబడిన ఇళ్ల వద్ద ప్రజలు ఉండకూడదని హెచ్చరించారు.

# మళ్లీ నంది అవార్డులు!

**2026 డిసెంబర్‌లోగా అవార్డులన్నీ అందజేత**

**రాష్ట్ర కార్పొరేషన్ ద్వారా కళాకారులకు సత్కారం**

**సినీ పరిశ్రమ అభివృద్ధికి కూటమి సర్కారు అండ**

**మంత్రి కందుల దుర్గేష్**




**అమరావతి, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** తెలుగు సినీ రంగంలో ప్రత్యేక స్థానం పొందిన నంది అవార్డులను ఈ డిసెంబర్‌లో ఇవ్వనున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కళాకారులకు, సాంకేతిక నిపుణులకు పెద్దపీట వేస్తూ తెలుగు చలనచిత్ర పరిశ్రమకు సముచిత గౌరవం కల్పిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం మేరకు నంది అవార్డుల వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని మంగళవారం 1 ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు సెప్టెంబర్‌లో కమిటీ ఏర్పాటు చేసి, అక్టోబర్‌లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని, నవంబర్‌లో అవార్డులను ప్రకటించి, డిసెంబర్‌లో ప్రదానం చేస్తామని స్పష్టం చేశారు.

2025 సంవత్సరానికి అన్ని కేటగిరీల్లో నంది ఫిల్మ్, టీవీ అవార్డులను ఇవ్వాలని, దానితో పాటు 2012 నుండి 2016 వరకు ఇదివరకే ప్రకటించిన 288 ఫిల్మ్ అవార్డులు, 330 టీవీ అవార్డులు ఇవ్వనున్నామన్నారు. అలాగే 2017 నుండి 2024 వరకు సంవత్సరానికి 4 అవార్డుల చొప్పున (2 ప్రొడక్షన్, 2 స్పెషల్ జ్యూరీ) ఫిల్మ్, టీవీ అవార్డులను ప్రదానం చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. అమరావతి లేదా విజయవాడ వేదికగా నంది ఫిల్మ్, జాతీయ చలన చిత్ర అవార్డులను, తిరుపతి వేదికగా నంది టీవీ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. ఈ అవార్డులన్నీ 2026 డిసెంబర్ లోగా ఇవ్వనున్నామన్నారు. తెర వెనుక శ్రమించిన ప్రతిభకు, తెరపై రక్తికట్టించిన నటనకు ప్రభుత్వం తరఫున సత్కరించేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. చలనచిత్రాలు, జాతీయ సమైక్యత చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యా విషయక చిత్రాలు, తెలుగు సినిమాపై రచించిన ఉత్తమ రచనలు తదితర 46 అవార్డులను నంది ఫిల్మ్ అవార్డులుగా అందించనున్నామన్నారు. అవార్డు గ్రహీతలకు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులు, ప్రశంసాపత్రంతో పాటు నగదు పారితోషికం అందిస్తామన్నారు. అలాగే వివిధ కేటగిరీల్లో 8 గోల్డ్ మెడల్స్ ఇస్తామన్నారు.

**జాతీయ అవార్డులకు నగదు..**

జాతీయ చలన చిత్ర అవార్డుల విభాగంలో ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డుకు 5 లక్షలు, బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి-చక్రపాణి, రఘుపతి వెంకయ్య అవార్డులకు ఒక్కొక్కరికి 2 లక్షల చొప్పున నగదు, జ్ఞాపిక, సన్మాన పత్రం అందజేస్తామన్నారు. నంది టీవీ అవార్డుల్లో టెలి చిత్రాలు, ఫీచర్స్, మెగా సీరియల్స్, డైలీ సీరియల్స్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, సామాజిక, విద్యా విషయక చిత్రాలు తదితర విభాగాల్లో మొత్తం 48 అవార్డులు అందిస్తామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సింగిల్ విండో విధానంలో షూటింగ్‌లకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. త్వరలోనే నూతన ఫిల్మ్ పాలసీని తీసుకొస్తామన్నారు. ప్రకృతి సిద్ధమైన లొకేషన్లున్న ఏపీలో అధికంగా షూటింగ్‌లు చేయాలని, డబ్బింగ్, రికార్డింగ్, రీరికార్డింగ్ థియేటర్లు తదితర మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని వెల్లడించారు. కళను, కళాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

# వీకెండ్ ఎకానమీ పెరగాలి!

(మొదటిపేజీ తరువాయి..)

నిమిత్తం 71 శాతం ఖర్చు పెడుతున్నారని వెల్లడించారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు మరింత అధ్యయనం చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా వారాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. గృహవసతి, రవాణా లాంటి అవసరాలపై పట్టణ ప్రజలు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్న నేపథ్యంలో టిడ్కో ఇళ్లతో పాటు స్త్రీశక్తి లాంటి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-అర్బన్ డెవలప్మెంట్ విభాగం అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

**2027 నాటికి టిడ్కో గృహాలు..**

2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. విశాఖ నగరంలో 28500 కుటుంబాలకు ఇప్పటికే ఇళ్ల పట్టాలు ఇచ్చామని, అభ్యంతరాలు లేని ప్రాంతాల్లో మరిన్ని పట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు 24 గంటలూ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతులను వేగంగా మంజూరు చేస్తున్నామని, పట్టణాభివృద్ధిలో పలు సంస్కరణలు చేపట్టామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల ద్వారా పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 143 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, ప్రస్తుతం 2 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని చెప్పారు. 2047 నాటికి ప్రతి మున్సిపాలిటీని స్వర్ణ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, అధికారులను ఆయన అభినందించారు. విశాఖపట్నం నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొనగా, కుప్పంలో పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



# కుప్పానికి కృష్ణా జలాలు!

- కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన సీఎం
- ప్రతి చెరువుకూ నీరందించడమే లక్ష్యం
- నియోజకవర్గంలో పండుగ వాతావరణం
- గతంలో 133 చెరువులు నింపిన ప్రభుత్వం
- శాశ్వత పరిష్కారానికి కీలక ముందడుగు



**కుప్పం, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** కుప్పం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి 2 వ దశలో కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా కృష్ణాజలాలను విస్తృతంగా వినియోగించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మంగళవారం శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీ-నీవా కాలువకు కృష్ణాజలాలు చేరిన సందర్భంగా ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కృష్ణమ్మకు పసుపు కుంకుమ, పూలు సమర్పించి కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కుప్పం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కృష్ణాజలాల రాకతో సాగు, తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడిందని తెలిపారు. నీటి వనరుల పెంపునకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, నీరు అందుబాటులో ఉంటే వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతాయని వివరించారు. గత ఏడాది కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా నీటిని తీసుకొచ్చి 133 చెరువులను నింపగలిగామని, ఇప్పుడు నియోజకవర్గంలోని సాధ్యమైన ప్రతి చిన్న నీటి వనరును కృష్ణాజలాలతో నింపి ప్రాంతాన్ని మరింత సస్యశ్యామలం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ పుంగనూరు బ్రాంచి కెనాల్‌లో 207.800 కిలోమీటర్ వద్ద ప్రారంభమై 131.200 కిలోమీటర్ల మేర కొనసాగుతూ కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువు వద్ద ముగుస్తుందని సీఎం తెలిపారు. ఎత్తిపోతలతో పాటు గురుత్వాకర్షణ ఆధారంగా పనిచేసే ఈ కాలువలో 3 ఎత్తిపోతల కేంద్రాలు ఉన్నాయని, నీటిని తరలించేందుకు 48 నీటి విడుదల మార్గాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**మండలాల వారీగా నిధుల కేటాయింపు..**

గుడుపల్లె మండలంలో 96 చెరువులకు 207.140 కోట్లతో నీరందించే పనులతో పాటు పారిశ్రామిక ప్రాంత అవసరాల కోసం 200 మిలియన్ క్యూబిక్ అడుగుల నిల్వ సామర్థ్యంతో కలివానక రిజర్వాయర్‌ను ప్రతిపాదించినట్లు సీఎం వెల్లడించారు. రామకుప్పం మండలంలో 128 చెరువులకు 101.830 కోట్లు, శాంతిపురం మండలంలో 87 చెరువులకు 78 కోట్లు, కుప్పం మండలంలో 107 చెరువులకు 63.570 కోట్లతో నీరందించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చే వేడుకతో గుండిశెట్టిపల్లి వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు, శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, డాక్టర్ వి.ఎం.థామస్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ వి.పిల్లారాత్, కలెక్టర్ సుమిత్‌కుమార్, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తిరుభూషణ్‌కుమార్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, కుడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, అధికారులు పాల్గొన్నారు.

# టీచర్ల జోలికొస్తే దబిడి దిబిడే!

**జగన్‌కు నారా లోకేశ్ స్ట్రాంగ్ వార్నింగ్**



**అనంతపురం, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** రాప్తాడు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సభకు తాను ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడిగానో, బాలకృష్ణ అల్లుడిగానో రాలేదని, కేవలం కార్యకర్తల అభిమానిగా విచ్చేసినట్లు చెప్పారు. తనకు సొంత అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు లేకపోయినా, తాత ఎన్టీఆర్ పార్టీ ద్వారా 1 కోటి మంది తోబుట్టువులను ఇచ్చారని భావోద్వేగానికి గురయ్యారు. అనంతపురం జిల్లా ప్రజలు ఎప్పటినుంచో టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారని ప్రశంసించారు. తాను పాదయాత్ర చేసిన సమయంలో ఈ జిల్లా ప్రజల కష్టసుఖాలు స్వయంగా చూశానని చెప్పారు. ఇక్కడ పరిశ్రమల స్థాపన, సాగు, తాగునీటి అభివృద్ధి బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి 1 కుటుంబంగా ఏర్పడ్డాయని, చిన్నచిన్న సమస్యలు వస్తే 4 గోడల మధ్యే పరిష్కరించుకోవాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని, ఎన్నికల్లో ఎక్కడా తగ్గేదే లేదని క్యాడర్‌లో ఉత్సాహం నింపారు.

మాజీ సీఎం జగన్‌పై లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఉపాధ్యాయులపై నీకెందుకు అంత కక్ష? వారిపై దాడులు చేయిస్తావా?" అని మండిపడ్డారు. మెగా డీఎస్సీపై చర్చకు తాను సిద్ధమని, జగన్ సిద్ధమా అని సవాల్ విసిరారు. "విదేశాలకు లేదా ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే నీలా కోర్టుల చుట్టూ తిరిగి పర్మిషన్ తెచ్చుకునే ఖర్మ మాకు లేదు. మేము నీతిగా, నిజాయితీగా బతికేవాళ్లం" అని ఘాటుగా విమర్శించారు. జగన్ పెట్టిన అక్రమ కేసులన్నీ తప్పని సుప్రీంకోర్టు కూడా తేల్చిందని గుర్తుచేశారు. జగన్ జాగ్రత్త, మా ఉపాధ్యాయుల జోలికొస్తే దబిడి దిబిడే అంటూ లోకేశ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.




# కర్తవ్య దీక్షతో పనిచేయాలి

- ప్రజల సేవకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న రాష్ట్ర హోంమంత్రి అనిత
- 21 శిక్షణ కేంద్రాల్లో ముగిసిన శిక్షణ
- విధుల్లో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచన

**మంగళగిరి, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వం అత్యంత కీలకమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. తల్లిదండ్రుల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకుని ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలని నూతనంగా విధుల్లోకి అడుగుపెడుతున్న కానిస్టేబుళ్లకు సూచించారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6 వ బెటాలియన్ బీటీసీ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం 2025-26 బ్యాచ్‌కు చెందిన 149 మంది స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి అనిత శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు అవార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను ఎన్నో అడ్డంకులను అధిగమించి పూర్తి చేశామని తెలిపారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్ల స్టైపెండ్‌ను 4500 నుంచి 12500 కు పెంచుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణ కేంద్రాల్లో మొత్తం 5800 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తయిందని తెలిపారు. వీరిలో 2330 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు 1000 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండటం ఎంతో విశేషమన్నారు.

**పోలీసులంటే భరోసా కలగాలి..**

పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే అసలైన వెన్నెముక అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విపత్తులు, బందోబస్తు, అత్యవసర సమయాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీసు యూనిఫాం ప్రజల్లో భయాన్ని కాకుండా భరోసాను కల్పించేలా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, వారికి సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని సూచించారు. మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సైబర్ నేరాల నియంత్రణ కోసం సాంకేతిక నైపుణ్యాలు కలిగిన కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ అందించామని చెప్పారు.

**రాజ్యాంగానికి అనుగుణంగా విధులు..**

రాజ్యాంగానికి అనుగుణంగా రాగద్వేషాలకు అతీతంగా నీతి, నిజాయితీ, కర్తవ్య స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని హోంమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం రూపొందించిన 2047 విజన్‌లో కానిస్టేబుళ్లు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సర్వీసు పూర్తయి పదవీ విరమణ చేసే వరకు క్రమశిక్షణతో, ప్రశాంతంగా ప్రజలకు సేవలందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని నూతన కానిస్టేబుళ్లకు హోంమంత్రి అనిత సూచించారు.

ప్రజాగళమే
స్పంద

బుధవారం, 23 సెప్టెంబర్ 2026

# కల్కి రూపంలో కనువిందు!

- బ్రహ్మోత్సవాల్లో 8 వ రోజు రాత్రి అశ్వ వాహన సేవ
- కల్కి అలంకారంలో దర్శనమిచ్చిన మలయప్ప స్వామి
- మాడ వీధుల్లో భక్తుల గోవింద నామస్మరణ



**తిరుమల, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 8 వ రోజైన మంగళవారం రాత్రి అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీ మలయప్ప స్వామి వారు భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అశ్వ వాహనానికి ముందు గజరాజులు నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళ వాయిద్యాల నడుమ వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలతో పోలుస్తాయి. అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలను నియమించే నియామకుడిగా ఈ వాహన సేవ ద్వారా తెలియజేస్తున్నారు. కృష్ణ యజుర్వేదం పరమాత్మను అశ్వ స్వరూపంగా తెలియజేస్తోంది. కల్కి స్వరూపంలో అశ్వ వాహనంపై విహరించిన శ్రీ మలయప్ప స్వామి వారు కలియుగ దోషాలకు దూరంగా ఉండి, నామ సంకీర్తనను ఆశ్రయించి భగవంతుని అనుగ్రహం పొందాలని భక్తులకు ప్రబోధిస్తున్నట్లు ఈ ఉత్సవ అంతరార్థాన్ని పండితులు వివరిస్తున్నారు. ఈ వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ

# అంబటి రాంబాబుపై కేసు!

**మరో 50 మందిపైనా కేసు నమోదు**

**ప్రభుత్వ వాహనం ధ్వంసం చేశారని ఆరోపణ**

**పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కేసు**

**మంగళగిరి టోల్ ప్లాజా వద్ద ఉద్రిక్తత**



**మంగళగిరి, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** వైఎస్సార్సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు మరో 50 మంది పార్టీ శ్రేణులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ప్రభుత్వ వాహనాన్ని ధ్వంసం చేశారనే అభియోగాలపై ఈ చర్యలు తీసుకున్నారు. వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేస్తూ ముందస్తు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన పట్టించుకోలేదని తెలిపారు. మంగళగిరి టోల్ ప్లాజా వద్ద భారీ వాహన శ్రేణితో విజయవాడ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. జాతీయ రహదారిపై సాధారణ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే కారణాలతో పోలీసులు అంబటి రాంబాబుతో పాటు 50 మంది అనుచరులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పునర్జన్మ రహితం.. రథోత్సవం!

- ఉభయ దేవేరులతో కలిసి విహరించిన మలయప్ప
- మాడ వీధుల్లో అడుగడుగునా కర్పూర హారతులు
- రథంపై కేశవుని దర్శనంతో జన్మ ధన్యమన్న పండితులు
- ఉపనిషత్తుల సారాంశాన్ని గుర్తుచేసే ఆధ్యాత్మిక ఘట్టం

**తిరుమల, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఉభయ దేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని రథాన్ని లాగి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయ దేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామి వారిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. స్వామివారు రథంపై విహరిస్తుండగా భక్తులు అడుగడుగునా హారతులు సమర్పిస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. గోవింద నామస్మరణతో తన్మయులయ్యారు. తిరుమాడ వీధుల్లో భక్తులు వేచి ఉండి, స్వామి వారిని దర్శించుకున్నారు. అనాదికాలం నుంచి రాజులకు రథ సంచారం ప్రసిద్ధమైంది. యుద్ధాల్లోనూ రథాలను విరివిగా ఉపయోగించినట్లు భారతాది ఇతిహాసాలు, పురాణాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై 4 గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడని ఆర్ష గ్రంథాలు పేర్కొంటున్నాయి. ప్రసిద్ధ దేవాలయాల్లో ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి ఊరేగించే సంప్రదాయం ఆగమశాస్త్ర సమ్మతంగా కొనసాగుతోంది.

తిరుమల శ్రీవారి రథోత్సవం విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అనే ఆర్షవాక్యం రథంపై కొలువుదీరిన శ్రీకేశవుని దర్శనం పరమ పవిత్రమైనదని తెలియజేస్తోంది. భక్తులు రథానికి కట్టిన తాళ్లను పట్టుకుని స్వామివారి రథాన్ని ముందుకు లాగుతూ భక్తి పరవశ్యంలో మునిగిపోయారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రథోత్సవం సురక్షితంగా జరిగేలా టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

రథోత్సవానికి విశిష్టమైన తాత్త్విక సందేశం కూడా ఉంది. కఠోపనిషత్తులో ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనస్సును పగ్గాలుగా, ఇంద్రియాలను గుర్రాలుగా అభివర్ణించారు. ఇంద్రియాలకు విషయాలే మార్గాలుగా పేర్కొంటూ ఆత్మ, అనాత్మ వివేకాన్ని ఉపదేశించింది. రథోత్సవం భక్తులకు ఈ ఆధ్యాత్మిక తత్త్వాన్ని గుర్తుచేస్తుంది. భక్తులు రథాన్ని లాగుతున్నప్పటికీ, సకల జీవుల్లో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తన భక్తులను అనుగ్రహిస్తూ తన రథాన్ని తానే నడిపిస్తున్నాడనే భావన ఈ ఉత్సవంలో అంతర్లీనంగా ఉంది.

ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, తిరుమల చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జేఈవో డాక్టర్ ఎ.శరత్, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాలకు, పెళ్లికి లింకొద్దు!

**తప్పుడు ప్రచారాలపై వైఎస్ షర్మిల ఆగ్రహం**



**విజయవాడ, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అందించడంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై వస్తున్న రాజకీయ విశ్లేషణలు, పుకార్లను పూర్తిగా నిరాధారమైన కట్టుకథలుగా కొట్టిపారేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన ఆమె.. తన విశ్వసనీయతను, ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదని గట్టిగా హెచ్చరించారు. "నేను ఎవరినో కలిసినట్లు, ఎక్కడో చేరిపోతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అబద్ధం. గిట్టని వారు చేస్తున్న పసలేని ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నా. నా కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించేందుకే గతంలో జగన్ మోహన్ రెడ్డిని చివరిసారిగా కలిశాను. మళ్లీ ఇప్పుడు నా కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందించడానికి మాత్రమే కలవడం జరిగింది" అని ఆమె స్పష్టత ఇచ్చారు.

**రాజకీయాలకు, శుభకార్యానికి లింక్ వద్దు..**

అన్ని రాజకీయ పార్టీల అధినేతలను తన బిడ్డ పెళ్లికి రావాలని, ఆశీర్వదించాలని ఆహ్వానిస్తానని షర్మిల తెలిపారు. ఇందులో కొత్తేమీ లేదని, వింత అంతకంటే లేదని స్పష్టం చేశారు. కన్న కూతురు వివాహాన్ని అడ్డుపెట్టుకుని తెర వెనుక రాజకీయాలు చేసుకునే ఖర్మ వైఎస్సార్ బిడ్డగా తనకు లేదన్నారు. 1 శుభకార్యానికి, రాజకీయానికి లింకులు పెట్టి తన విశ్వసనీయతను, రాజకీయ ప్రమాణాలను దెబ్బతీయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల వివాహ మహోత్సవంతో 1 కాబోతున్న నవదంపతులను తెలుగు ప్రజలందరూ హృదయపూర్వకంగా ఆశీర్వదించాలని ఈ సందర్భంగా షర్మిల కోరారు.

# ధర్మవరానికి మహర్దశ!

- ధర్మవరానికి మహర్దశ!
- పట్టణ సమగ్ర అభివృద్ధికి 242.28 కోట్ల మహా ప్రణాళిక
- 43 కోట్లతో 27 కిలోమీటర్ల మేర కొత్త రహదారుల నిర్మాణం
- కుప్పం నుంచి హెచ్ఏఎం పనులకు సీఎం శ్రీకారం
- అమృత్ పథకాలతో పట్టణ తాగునీటి వ్యవస్థ బలోపేతం
- ప్రస్తుతం 104.28 కోట్ల పనులు పురోగతిలో ఉన్నట్లు వెల్లడి



**అమరావతి, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** ధర్మవరం పట్టణ సమగ్ర అభివృద్ధికి వివిధ పథకాల కింద మొత్తం 242.28 కోట్ల మేర పనులు చేపడుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరిచి పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కుప్పం నుంచి హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) పనులకు శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మవరం పట్టణానికి హెచ్ఏఎం కింద 43 కోట్ల విలువైన పనులు కేటాయించామని చెప్పారు. ఈ నిధులతో 25 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాలు అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. మొత్తం 27 కిలోమీటర్ల రహదారులకు 43 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ధర్మవరం పట్టణంలో ప్రస్తుతం 104.28 కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. యూఐడీఎఫ్-4 కింద 72 కోట్లు, యూసీఎఫ్ ఫేజ్-2 కింద 23 కోట్ల పనులు పరిపాలనా అనుమతుల దశలో ఉన్నాయని వెల్లడించారు.

బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధులతో పట్టణంలో 13 అభివృద్ధి పనులను 3.90 కోట్ల వ్యయంతో పూర్తి చేశామని మంత్రి తెలిపారు. 15 వ ఆర్థిక సంఘం నిధుల కింద సీసీ కాలువలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన 17 పనులను 4.19 కోట్లకు పైగా వ్యయంతో పూర్తి చేశామన్నారు. 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబంధించి మరో 3.67 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు డీఐ కే9 పైప్‌లైన్ ఏర్పాటు పనులకు 2.54 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

అమృత్ ఫేజ్-1 కింద 17.57 కోట్లతో ఇందిరమ్మ కాలనీ, సిద్ధయ్య గుట్ట ప్రాంతాల్లో ఎల్ఎస్ఆర్ ల నిర్మాణం, యర్రగుంట ప్రాంతంలో కొత్త పంప్‌హౌస్ నిర్మాణం, మోటర్ల ఏర్పాటు చేపట్టామని, ఇవి 90 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. అమృత్ ఫేజ్-2 కింద 11.18 కోట్లతో మారుతినగర్ ప్రాంతంలో కొత్త ఎల్ఎస్ఆర్, జోన్-2 పంపింగ్ మెయిన్, డెలివరీ లైన్ల నిర్మాణం 90 శాతం పూర్తయిందన్నారు. అమృత్ 2.0 కింద 31.73 కోట్ల విలువైన సమగ్ర తాగునీటి ప్రాజెక్టుకు అనుమతులు మంజూరయ్యాయని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో రోజుకు 10 ఎంఎల్డీ సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రం, రాంనగర్, గిర్రాజు కాలనీ, శాంతినగర్ ప్రాంతాల్లో ఎల్ఎస్ఆర్ ల నిర్మాణం ఉన్నాయన్నారు.

పురపాలక సంఘ సాధారణ నిధులతో సీసీ రోడ్లు, కాలువలకు సంబంధించి 58 పనులు చేపట్టి 2.23 కోట్ల వ్యయంతో పూర్తి చేశామన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద సద్భావన భవనం నిర్మాణానికి 50 లక్షలు మంజూరయ్యాయని వెల్లడించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద 21.68 కోట్లు కేటాయించామని, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 5.20 కోట్లతో రోడ్లు, డ్రైన్లు, పూడికతీత పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. తన నిరంతర పర్యవేక్షణతో అన్ని పనులను సమన్వయంతో పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

# గాళ్ళ సుబ్రమణ్యం కన్నుమూత!

**కాపునాడు జాతీయ అధ్యక్షుడు మృతి**

**విజయవాడ నివాసంలో తుదిశ్వాస**

**కాపు, బలిజ వర్గాల్లో తీవ్ర విషాదం**

**సంతాపం తెలిపిన పలువురు నేతలు**

**ఒంగోలు, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** కాపునాడు జాతీయ అధ్యక్షుడు, కాపునాడు పత్రిక నిర్వాహకులు గాళ్ళ సుబ్రమణ్యం మృతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాపు, బలిజ సామాజిక వర్గానికే కాకుండా దేశ, విదేశాల్లోని ఆయా కుటుంబాలకు తీరని లోటని పలువురు కాపునాడు నేతలు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాపు సంఘ నేతగా విశేష గుర్తింపు పొందిన సుబ్రమణ్యం మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో విజయవాడలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సంఘం అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, గ్రేటర్ రాయలసీమ జోన్ కోఆర్డినేటర్ పూల పాండు రంగయ్య నాయుడు, గ్రేటర్ రాయలసీమ మహా బలిజ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మిద్దె శాంతి రాముడు, మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ నాయుడు మాల్యాద్రి, నెల్లూరు జిల్లా కాపు-బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు డాక్టర్ బెల్లపు సుధా మాధవ్ తదితరులు సంయుక్త ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు.



విజయవాడ నగరంలో గత 60 ఏళ్ల కాలం నుంచి నివాసముంటున్న సుబ్రమణ్యం, దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావుకు అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. కాపు సామాజిక వర్గానికి చెందిన అగ్రనేతల మరణానంతరం ఆయన కాపునాడు సంఘానికి జాతీయ స్థాయి నేతగా ఎన్నికయ్యారు. 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇటు కోస్తా జిల్లాల్లో కాపు కుల పెద్దలతో, అటు గ్రేటర్ రాయలసీమ ప్రాంతంలో బలిజ ప్రతినిధులతో కలిసి ప్రత్యేకంగా చర్చలు జరిపారని పూల పాండు రంగయ్య నాయుడు గుర్తుచేసుకున్నారు. కాపు, బలిజ సామాజిక వర్గాలను ఏకం చేయడంలో సుబ్రమణ్యం చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు.

రాష్ట్ర కాపునాడు సంఘంలో దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా, వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల వెంకట్రావు, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తర్వాత ఆ స్థాయి విశిష్ట గుర్తింపును గాళ్ళ సుబ్రమణ్యం దక్కించుకున్నారని నేతలు స్మరించుకున్నారు. సుబ్రమణ్యం మృతికి సత్యసాయి జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు ఇడికంటి మహేష్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాపా ధనుంజయ్, హిందూపురం నియోజకవర్గ అధ్యక్షుడు బలిజ మహేష్ నాయుడు, శింగనమల నియోజకవర్గ అధ్యక్షుడు తోట ఓబులేష్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు కాపు, బలిజ సంఘాల ప్రతినిధులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆయుర్వేదానికి పెద్దపీట!

**11 వ ఆయుర్వేద దినోత్సవానికి కేంద్రం ప్రాధాన్యం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** 11 వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా "ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం" అనే థీమ్‌తో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా 12260 ఆయుష్ ఆరోగ్య మందిరాలు పనిచేస్తుండగా, 13249 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఆయుష్ సేవలు అందుబాటులో ఉన్నాయి. 2014-15 నుంచి 2025-26 వరకు జాతీయ ఆయుష్ మిషన్ కింద రాష్ట్రాలకు రూ. 6406.99 కోట్లు విడుదలయ్యాయి. ఈ-సంజీవని ద్వారా 50 కోట్లకు పైగా మందికి టెలీమెడిసిన్ సేవలు అందించగా, ఆయుష్ చికిత్సలకు బీమా కవరేజ్ కూడా కల్పించారు. 2026-27 బడ్జెట్‌లో ఆయుష్ మంత్రిత్వ శాఖకు కేంద్రం రూ. 4408 కోట్లు కేటాయించింది.



ప్రజాపక్షమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 23 సెప్టెంబర్ 2026



# పూర్తి వందేమాతరంపై అభ్యంతరం!

**జాతీయ హోదా, భద్రత కల్పిస్తూ సవరణపై సుప్రీంలో సవాల్**

**6 పాదాల పూర్తి గేయం ఆలపించడంపై రిట్ పిటిషన్**

**లౌకికవాదానికి విరుద్ధమని పిటిషనర్ టీఎం కృష్ణ వాదన**

**మతపరమైన కారణాలతో పాడకుంటే రక్షణ కల్పించాలన్న కోర్టు**

**బిజో ఎమ్మాన్యుయెల్ తీర్పును ప్రస్తావించిన వైనం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** జాతీయ గేయం వందేమాతరం పూర్తి గేయాలాపన, 1 వేళ పూర్తి గేయం పాడకుంటే నేరంగా పరిగణించి శిక్షించడం వంటి కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. వందేమాతరానికి జాతీయ హోదా, భద్రత కల్పిస్తూ ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్, 1971 కు చేసిన 2026 సవరణ, అధికారిక కార్యక్రమాల్లో 6 పాదాల పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించడం తప్పనిసరి చేస్తూ హోం వ్యవహారాల శాఖ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కర్ణాటక సంగీతకారుడు టీఎం కృష్ణ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ సవరణలో కేంద్ర ప్రభుత్వం జాతీయ గేయానికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదని, అలాగే మతపరమైన అభ్యంతరాలతో పూర్తి గేయాన్ని ఆలపించకున్నా దాన్ని నేరంగా పరిగణించి శిక్షించడం సదరు వ్యక్తి ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుందని పిటిషనర్ పేర్కొన్నారు. రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమైన లౌకికవాదానికి ఈ నిర్ణయాలు విరుద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ అడ్వకేట్ డాక్టర్ ఎస్ మురళీధర్, ప్రభుత్వ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. సీజే సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనల ధర్మాసనం ఈ పిటిషన్‌పై మంగళవారం వాదనలు విన్నది.

### ఆ 4 పాదాలపైనే వివాదం..

పిటిషనర్ లేవనెత్తిన వివాదం వందేమాతరం చివరి 4 పాదాల చుట్టే ఉంది. 6 పాదాల వందేమాతరం గేయంలో చివరి 4 పేరాల్లో దుర్గ, లక్ష్మీ, సరస్వతి సహా పలువురు హిందూ దేవుళ్ల ప్రస్తావన ఉందని, అయినా ఆ పాదాలను పౌరులందరూ ఆలపించాలని కోరడమంటే మన రాజ్యాంగ మౌలిక సూత్రాల్లో 1 అయిన లౌకికవాదాన్ని ఉల్లంఘించినట్టే అవుతుందని కృష్ణ వాదిస్తున్నారు. 2026 సవరణ ద్వారా జాతీయ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా పాడకున్నా, లేదా డిస్టర్బ్ చేసినా గరిష్టంగా 3 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. ఆ తర్వాత కేంద్ర హోం శాఖ ఆదేశాలు 6 పాదాల వందేమాతరం గేయాన్ని అధికారిక గేయంగా గుర్తిస్తూ.. కొన్ని ప్రభుత్వ, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఈ ఫుల్ వర్షన్ గేయాన్ని ఆలపించాలని స్పష్టం చేశాయి. వందేమాతరం, జనగణమన రెండూ పాడే కార్యక్రమాల్లో జాతీయ గీతం కంటే ముందుగా జాతీయ గేయాన్ని ఆలపించాలని కేంద్రం ఆదేశించింది. సవరణ, హోం శాఖ ఆదేశాలు కలిపి చూస్తే 1 వేళ మతపరమైన కారణాలతో వందేమాతరం చివరి పాదాలను పాడకుంటే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మత, నైతికపరమైన కారణాలతో పూర్తి గేయాన్ని పాడటాన్ని నిరాకరిస్తే వారికి ఈ శిక్ష నుంచి రక్షణ కల్పించాల్సి ఉంటుందని, బిజో ఎమ్మాన్యుయెల్ తీర్పు చెబుతున్నట్లు ఈ రక్షణ ఉండాలని పిటిషనర్ కృష్ణ పేర్కొన్నారు.

### నక్సలైట్ వ్యాఖ్యలపై వాగ్వాదం..

సెక్యులరిజానికి ఆదర్శంగా చెప్పుకునే అమెరికాలోనూ జాతీయ గీతంలో 'ఇన్ గాడ్ వీ ట్రస్ట్' ఉంటుందని జస్టిస్ బాగ్చి గుర్తు చేశారు. సెక్యులరిజం మరీ ఇంత ఇరుకుగా ఉంటుందని అనుకోవట్లేదని ఎస్‌జీ తుషార్ మెహతా కామెంట్ చేశారు. సవరణలో జాతీయ గేయాన్ని నిర్వచించలేదని మురళీధర్ అనగా.. సాంప్రదాయంగా అది వందేమాతరమే అని అర్థం చేసుకోవచ్చని బాగ్చి వివరించారు. 'అంటే 2 పేరాల వందేమాతరమేగా' అని మురళీధర్ స్పందించారు. ఈ సవరణ, కేంద్ర మెమోరాండం రెండింటితో వందేమాతరంపై అవగాహననే ప్రభుత్వం మార్చేసిందని, జాతీయ విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే ఆదరబాదరాగా ఈ సవరణ చేశారని వాదించారు. 'చట్టాలు నక్సలైట్ల ఆలోచనలకు అనుగుణంగా చేయరు' అని సొలిసిటర్ కలుగజేసుకున్నారు. ఆ వ్యాఖ్యపై తీవ్ర అభ్యంతరం చెబుతూ వెనక్కి తీసుకోవాలని మురళీధర్ డిమాండ్ చేశారు. చట్టాల రూపకల్పన ప్రక్రియను గౌరవించని వారి గురించే అన్నట్లు పేర్కొన్న సొలిసిటర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునేందుకు నిరాకరించారు.

### రక్షణ ఉంటుందనే ఆశిస్తున్నాం..

బిజో ఎమ్మాన్యుయెల్ వర్సెస్ కేరళ కేసులో ఈ కోర్టు ఇచ్చిన తీర్పుకు లోబడే ఈ చట్ట సవరణ ఉందని భావిస్తున్నామని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. జాతీయ గేయం ఏమిటనేది వివాదం కాదని, ఏది జాతీయ గేయం, దానిలో ఎన్ని పాదాలుండాలనేది ప్రభుత్వ నిర్ణయమని తెలిపింది. కానీ ఆర్టికల్ 25, 26 ల కింద తనకు కల్పించిన హక్కుల ఉల్లంఘన జరుగుతోందని భావించిన వారిని, మతపరమైన కారణాలతో పాడకుండా నిరాకరించిన వారిని శిక్షించకుండా రక్షణ ఉండాలని స్పష్టం చేసింది. వారిని శిక్షించబోరని ఆశిస్తున్నామని, మతపరమైన అభ్యంతరాలున్న వారు 1 పాదం లేదా పూర్తి గేయాన్ని పాడే వెసులుబాటు ఉండాలని వివరించింది. అనంతరం ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని ఆదేశించింది.

# పట్టపగలే దోపిడీ!

**క్యాన్సర్ మందు ధరపై సుప్రీంకోర్టు ఆందోళన**

**తయారీ ధర, ఎంఆర్‌పీ మధ్య భారీ వ్యత్యాసం**

**లోపాలను కోర్టుకు వివరించిన పిటిషనర్ కిషన్ చంద్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** మెడిసిన్స్ తయారీదారులు వాటిని రిటైలర్లకు అమ్మే ధరలు, ఆ మందులపై ముద్రించే ఎంఆర్‌పీల మధ్య ఉన్న అసాధారణ వ్యత్యాసంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 1 క్యాన్సర్ మందును తయారీదారులు రిటైల్ స్టోర్లకు రూ. 2700 కు అమ్మితే, దానిపై ఎంఆర్‌పీ మాత్రం రూ. 27000 ఉన్నదని, ఇది పేషెంట్లను పట్టపగలే దోచుకోవడం కాక మరేంటని ప్రశ్నించింది. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో ఆశ్చర్యంగా ఉందని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. ఈ భారీ తేడాకు గల కారణాలను పిటిషనర్ కిషన్ చంద్ జైన్ వివరిస్తూ.. మందులపై ధరలు నిర్ణయించడంలోనే అసలు సమస్య ఉందని తెలిపారు. షెడ్యూల్డ్ మెడిసిన్లపై ధరలకు డీపీసీవో గరిష్ట పరిమితి విధిస్తుందని, నాన్ షెడ్యూల్డ్ మందులపై పరిమితి ఉండదని స్పష్టం చేశారు. కానీ 10 రెట్లకు మించకుండా ఎంఆర్‌పీ ఉండాలనే 1 నిబంధన మాత్రమే ఉందని వివరించారు. మార్కెట్లో దాదాపు 83 శాతం మందులు నాన్ షెడ్యూల్డ్ కేటగిరీలోనే ఉంటాయని, కేవలం 17 శాతం మాత్రమే షెడ్యూల్డ్ పరిధిలోకి వస్తాయని పిటిషనర్ కోర్టుకు తెలియజేశారు. వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం ఈ పిటిషన్ తదుపరి విచారణను ఈ నెల 29 కి వాయిదా వేసింది.

# రాజ్యసభలో 12 స్థానాలకు ఎన్నికల నగారా

- అక్టోబర్ 16న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక స్థానానికి ఎన్నికలు
- పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక
- సెప్టెంబర్ 29న నోటిఫికేషన్.. అక్టోబర్ 6 వరకు నామినేషన్లు
- నవంబర్ 25తో పలువురు సభ్యుల పదవీకాలం ముగింపు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** రాజ్యసభలో ఖాళీ కానున్న స్థానాలకు ఎన్నికల నగారా మోగింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 11 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలతో పాటు పశ్చిమ బెంగాల్‌లో ఖాళీ అయిన ఒక స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. మొత్తం 12 స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ నిర్వహించనుంది. ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో తొమ్మిది మంది సభ్యులతో పాటు ఉత్తరాఖండ్‌కు చెందిన సభ్యుడి పదవీకాలం నవంబర్ 25తో ముగియనుంది. ఉత్తరప్రదేశ్‌లో మరో స్థానం మాజీ ఉప ముఖ్యమంత్రి దినేశ్ శర్మ రాజీనామాతో ఇప్పటికే ఖాళీ అయింది. అండమాన్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రుక్మిణి మల్లిక్ జులై 16న రాజీనామా చేయడంతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కూడా అదే రోజు ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ స్థానంలో ఎన్నికయ్యే సభ్యుడి పదవీకాలం 2032 ఏప్రిల్ 2 వరకు కొనసాగుతుంది. ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 29న విడుదల చేయనున్నారు. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీ. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా, అభ్యర్థిత్వాల ఉపసంహరణకు అక్టోబర్ 9 వరకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియను అక్టోబర్ 19లోగా పూర్తి చేయనున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటర్లు బ్యాలెట్ పత్రంపై ప్రాధాన్యతలను నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి అందించే ప్రత్యేక వైలెట్ రంగు స్కెచ్ పెన్నును మాత్రమే ఉపయోగించాలి. ఇతర పెన్నులతో ప్రాధాన్యతలను గుర్తించరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పరిశీలకులను నియమించి పర్యవేక్షించనుంది. ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ సభ్యులు హర్దీప్ సింగ్ పూరి, అరుణ్ సింగ్, గీతా షాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బీఎల్ వర్మ, సీమా ద్వివేది, సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీ నేత రామ్‌జీ గౌతమ్‌ల పదవీకాలం నవంబర్ 25తో ముగియనుంది. ఉత్తరాఖండ్ నుంచి బీజేపీ సభ్యుడు నరేశ్ బన్సాల్ పదవీకాలం కూడా అదే రోజుతో ముగుస్తుంది. దినేశ్ శర్మ ప్రాతినిధ్యం వహించిన ఉత్తరప్రదేశ్ స్థానం ఆయన రాజీనామాతో ఇప్పటికే ఖాళీ అయింది.

# ఆ నోటీసులకు కారణమేంటి?

- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- 'లాజికల్ డిస్క్రిపెన్సీ' అంటే ఏంటో చెప్పాలని ఆదేశం
- యాంత్రికంగా నోటీసులు జారీ చేస్తున్నారా?.. ధర్మాసనం ప్రశ్న
- ఢిల్లీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విచారణ
- చట్టబద్ధ ప్రక్రియ లేకుండా ఒక్క ఓటూ తొలగించబోమన్న ఈసీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా లక్షల మంది ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. 'లాజికల్ డిస్క్రిపెన్సీ' పేరుతో నోటీసులు ఇవ్వడానికి అసలు ప్రాతిపదిక ఏమిటని నిలదీసింది. ఈ పదానికి అర్థమేంటి? ఏ ప్రమాణాలతో ఓటర్లను ఈ విభాగంలోకి తీసుకొస్తున్నారు? నోటీసులు యాంత్రికంగా జారీ అవుతున్నాయా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టింది. ఢిల్లీలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పిటిషనర్ల తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో నిర్దిష్ట కారణాలను స్పష్టంగా తెలియజేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఏ ప్రాతిపదికన ఒక ఓటరును 'లాజికల్ డిస్క్రిపెన్సీ' విభాగంలోకి తీసుకొస్తున్నారో స్పష్టత లేదన్నారు. ఈ వర్గీకరణకు సంబంధించిన ప్రమాణాలు, నిర్వచనాలు, విధివిధానాలను బహిర్గతం చేయాలని పిటిషనర్లు కోరారు. ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు దక్కిన వారిలో దాదాపు 33.13 లక్షల మందిని 'నో మ్యాపింగ్', 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' కారణాలతో నోటీసుల కోసం గుర్తించినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. వీరిలో 13.79 లక్షల మందిని 'నో మ్యాపింగ్', 19.33 లక్షల మందిని 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' విభాగంలో గుర్తించినట్లు కోర్టు ముందుంచారు. వాదనల సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. పెద్ద సంఖ్యలో నోటీసులు దాదాపు యాంత్రికంగా జారీ అవుతున్నట్లు కనిపిస్తోందని పేర్కొంటూ, ఈ ప్రక్రియలో అదనపు రక్షణ చర్యలు అవసరమేమో పరిశీలించాలని ఎన్నికల సంఘానికి సూచించింది. 'లాజికల్ డిస్క్రిపెన్సీ'గా గుర్తించడానికి ఉపయోగిస్తున్న ప్రాతిపదికపై స్పష్టత అవసరమని తెలిపింది. నోటీసు అందుకున్న ఓటరికి తన వివరాల్లో అసలు సమస్య ఏమిటో అర్థమయ్యేలా కారణం తెలియజేయాల్సిన అవసరాన్ని కోర్టు ప్రస్తావించింది. ఓటర్ల స్పందనను సులభతరం చేసేందుకు వాట్సాప్, ఈమెయిల్ వంటి మార్గాలను కూడా పరిశీలించాలని సూచించింది. ఎన్నికల సంఘం తరపున వాదనలు వినిపించిన న్యాయవాది.. చట్టంలో నిర్దేశించిన ప్రక్రియను పాటించకుండా ఏ ఒక్కరి పేరునూ ఓటర్ల జాబితా నుంచి తొలగించబోమని



కోర్టుకు తెలిపారు. నోటీసుల వెనుక కారణాలను ఓటర్లకు తెలియజేస్తున్నామని, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇదిలా ఉండగా, సుప్రీంకోర్టు విచారణకు ముందే ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నోటీసులు అందుకున్న ఓటర్లకు సంబంధించిన బూత్‌ల వారీ వివరాలను, గుర్తించిన వ్యత్యాసాల కారణాలను ప్రచురించింది. పేర్లు, తల్లిదండ్రుల పేర్లలో తేడాలు, గత ఓటర్ల జాబితాతో అనుసంధానం కాకపోవడం వంటి కారణాలను అందులో పేర్కొంది.

# యూపీఐ చెల్లింపులపై అపోహలొద్దు

- ఎండీఆర్‌పై కేంద్రం స్పష్టత
- చిరు వ్యాపారులపై అదనపు భారం ఉండదని వెల్లడి
- రూ.2 వేల వరకు మర్చంట్ చెల్లింపులకు ఎండీఆర్ సున్నా
- మెజారిటీ డిజిటల్ లావాదేవీలపై ప్రభావం లేదని వివరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించనున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం మంగళవారం స్పష్టత ఇచ్చింది. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావులేదని, చిరు వ్యాపారులపై అదనపు భారం పడదని వెల్లడించింది. రూ.2 వేల వరకు జరిగే మర్చంట్ చెల్లింపులకు ఎండీఆర్ పూర్తిగా సున్నా అని పేర్కొంది. యూపీఐ చెల్లింపులు ఖరీదవుతాయన్న వాదనలు తప్పుదారి పట్టించేవని కేంద్రం తెలిపింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మెజారిటీ డిజిటల్ చెల్లింపులకు ఎండీఆర్ వర్తించదని వివరించింది. దీనివల్ల సాధారణ వినియోగదారులు, చిరు వ్యాపారులపై పెద్దగా ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. ఎండీఆర్ వర్తించే సందర్భాల్లో వ్యాపారి చెల్లించిన జీఎస్టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా పొందవచ్చని కేంద్రం వివరించింది. అమ్మకాలపై చెల్లించాల్సిన జీఎస్టీ నుంచి దీనిని సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది. నెలకు లక్ష రూపాయల వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే వ్యాపారులకు ఎండీఆర్ ఉండదని, అందువల్ల ఎండీఆర్‌పై జీఎస్టీ భారం కూడా తలెత్తదని తెలిపింది. యూపీఐ లావాదేవీలపై కొత్తగా భారీ ఛార్జీలు పడతాయన్న ప్రచారంతో వినియోగదారులు, చిరు వ్యాపారులు ఆందోళన చెందాల్సిన




అవసరం లేదని కేంద్రం స్పష్టం చేసింది.

# ఇక సబ్బులు, షాంపూలపై 'వెజ్.. నాన్ వెజ్' ముద్ర

### కేంద్రం కొత్త నిబంధనలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** మనం రోజూ వాడే సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్టులు మరియు ఇతర సౌందర్య సాధనాలు శాకాహార మూలాలతో తయారయ్యాయా లేక మాంసాహార పదార్థాలు ఉన్నాయా అన్నది ఇకపై ప్యాకెట్‌ను చూడగానే తెలిసిపోనుంది. ఇప్పటివరకు కేవలం తినుబండారాలు, ఆహార ఉత్పత్తులకే పరిమితమైన 'వెజ్, నాన్-వెజ్' రంగుల ముద్ర విధానాన్ని ఇకపై నిత్య ఉపయోగీ సౌందర్య సాధనాలకూ (కాస్మోటిక్ అండ్ టైలెట్రీస్) కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ మేరకు 'లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) ఫోర్త్ అమెండ్‌మెంట్ రూల్స్, 2026' ను కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటిఫై చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, శాకాహార



మూలాలు కలిగిన ఉత్పత్తుల ప్యాకేజింగ్‌పై ఆకుపచ్చ (గ్రీన్) రంగు చుక్క గుర్తును ముద్రించాల్సి ఉంటుంది. జంతువుల కొవ్వులు, జెలటిన్ లేదా ఇతర మాంసాహార మూలాల సమ్మేళనంతో తయారైన ఉత్పత్తులపై ఎరుపు (రెడ్) లేదా గోధుమ (బ్రౌన్) రంగు చుక్క గుర్తును తప్పనిసరిగా వేయాలి. వినియోగదారులకు షాపింగ్ చేసే సమయంలో స్పష్టంగా కనిపించేలా ఈ చిహ్నాలను ప్యాకెట్ ముందరి భాగంలో పైభాగంలోనే అమర్చాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇన్నాళ్లూ సబ్బులు లేదా టూత్‌పేస్టులలో వాడిన పదార్థాల వివరాలు తెలుసుకోవాలంటే ప్యాకెట్ వెనుక ఉన్న క్లిష్టమైన కెమికల్ పేర్ల జాబితాను చదవాల్సి వచ్చేది. కొత్త నిబంధన అమలులోకి రావడంతో, వినియోగదారులు తమ వ్యక్తిగత, నమ్మకాలకు అనుగుణంగా ఉత్పత్తులను సులభంగా ఎంచుకునే వెసులుబాటు లభించనుంది.

ప్రజాపక్షమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 23 సెప్టెంబర్ 2026

# 527 కోట్లతో పట్టణాభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నాలుగు పట్టణాల్లో మౌలిక వసతుల విస్తరణకు శ్రీకారం: జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ**

**సమగ్ర ప్రాజెక్టులతో గుంటూరును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే మాధవి, నజీర్ అహ్మద్**





**గుంటూరు, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** గుంటూరు జిల్లా పరిధిలోని నాలుగు ప్రధాన పట్టణాల్లో రూ.527 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న పట్టణాభివృద్ధి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 123 మున్సిపాలిటీలలో రూ.11,360 కోట్ల అంచనా వ్యయంతో ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, గుంటూరు తూర్పు, పశ్చిమ శాసనసభ్యులు మహమ్మద్ నజీర్ అహ్మద్, గల్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా పాల్గొని శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ, కేటాయించిన రూ. 527 కోట్ల నిధులతో గుంటూరు నగరపాలక సంస్థకు రూ. 205 కోట్లు, మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్‌కు రూ. 250 కోట్లు, తెనాలి మున్సిపాలిటీకి రూ. 44 కోట్లు, పొన్నూరు మున్సిపాలిటీకి రూ. 28 కోట్లు హెచ్ఏఎం (నావీ) మోడల్‌లో వెచ్చించనున్నట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా అన్ని పట్టణ స్థానిక సంస్థలను కలుపుకొని ఇంత పెద్ద మొత్తంలో మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టడం విశేషమన్నారు. అమరావతి రాజధాని నగర పరిసరాల్లో ఉన్న గుంటూరు జిల్లా భవిష్యత్తులో అత్యంత వేగంగా అర్బన్ జిల్లాగా రూపుదిద్దుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఖర్చు చేసే ప్రతి రూపాయీ నాణ్యతతో, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించేలా ఇంజనీరింగ్ అధికారులు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### పైలట్ ప్రాజెక్టులుగా అండర్‌గ్రౌండ్ డక్ట్స్, వేస్ట్ మేనేజ్‌మెంట్

నగరంలో అస్తవ్యస్తంగా వేలాడుతున్న ఓవర్‌హెడ్ కేబుళ్లకు ముగింపు పలికేందుకు, ఎమ్మెల్యే గల్లా మాధవి సూచనల మేరకు ఎంపిక చేసిన మోడల్ రోడ్డులో అండర్‌గ్రౌండ్ డక్ట్స్ ఏర్పాటును పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అలాగే విదేశీ సాంకేతికతతో కూడిన అండర్‌గ్రౌండ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (చెత్త సేకరణ) విధానాన్ని సైతం గుంటూరులో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

### నగరాల రూపురేఖలు మార్చనున్న హెచ్ఏఎం మోడల్

పట్టణాలు, నగరాలు రాష్ట్ర ముఖచిత్రాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పార్కుల అభివృద్ధి పనులను విడివిడిగా కాకుండా సమగ్రంగా చేపట్టడానికి హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (నావీ) దోహదపడుతుందన్నారు. నగరంలో ఒక వార్డును 'స్మార్ట్ వార్డ్'గా తీర్చిదిద్దాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ, ఇప్పటికే గుంటూరు నగరంలో సుమారు రూ. 1,000 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, నూతనంగా మంజూరైన రూ. 205 కోట్లతో మారుమూల కాలనీలకు సైతం పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, హాజ్ కమిటీ చైర్మన్ షేక్ హాసన్ భాష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ వందన, మున్సిపల్ అధికారులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# 127.11 కోట్లతో నరసరావుపేట ప్రగతి పథం

**'హామ్' కింద పల్నాడు జిల్లాకు ₹236 కోట్లు..**

**నరసరావుపేటకు తొలి విడతగా ₹37 కోట్లు**

**సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వర్చువల్ శంకుస్థాపన**

**ఆరు నెలల్లో రోడ్లు, సెంట్రల్ మీడియన్లు, వీధి దీపాల పనులు పూర్తి:కలెక్టర్ కృతికా శుక్ల,ఎమ్మెల్యే చదలవాడ**



**నరసరావుపేట, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణాన్ని ప్రపంచస్థాయి మౌలిక వసతులతో సమగ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోని 123 పురపాలక సంఘాల్లో రూ.11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నరసరావుపేట ప్రకాశ్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన భారీ డిజిటల్ స్క్రీన్ ద్వారా జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు వీక్షించి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పనులను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని 8 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ప్రాజెక్ట్ కింద మొత్తం రూ.236 కోట్ల విలువైన పనులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, రానున్న రెండు మూడు రోజుల్లోనే గ్రౌండింగ్ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన నరసరావుపేట మున్సిపాలిటీకి ప్రత్యేకంగా తొలి విడతలో రూ.37 కోట్ల పనులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ నిధులతో 14.72 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 0.24 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు, 13.88 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్ (డివైడర్ల) అభివృద్ధికి రూ.5 కోట్లు, నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.4 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.2 కోట్లు, పట్టణంలోని అన్ని వార్డుల్లో వీధి దీపాల (స్ట్రీట్ లైటింగ్) ఏర్పాటుకు రూ.1.50 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి కొంత సమయం పట్టినప్పటికీ, ప్రజలకు నిత్యం అవసరమైన రోడ్లు, డివైడర్లు, వీధి దీపాల పనులను రాబోయే ఆరు నెలల్లో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ చెప్పారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పట్టణ ప్రగతికి నిధుల కొరత అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం బ్యాంక్ రుణాలు, ప్రైవేటు పెట్టుబడులను సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేస్తోందన్నారు. ఇప్పటికే అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద రూ.45.11 కోట్ల విలువైన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, వీటికి అదనంగా నావీ ప్రాజెక్టు మరియు యూఐడీఎఫ్ – – 3&4) పథకాల ద్వారా మరో రూ.83 కోట్లు కేటాయిస్తూ, మొత్తంగా నరసరావుపేట పురపాలక సంఘం అభివృద్ధికి రూ.127.11 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ముఖ్యంగా గతంలో వెలుతురు లేక ప్రమాదాలకు నిలయంగా మారిన బ్లాక్ స్పాట్లను గుర్తించి, 1 నుంచి 33 వార్డుల్లో పూర్తిస్థాయిలో వీధి దీపాలు ఏర్పాటు చేయడం ద్వారా రాత్రివేళల్లో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే జాతీయ రహదారి పక్కన ఏళ్ల తరబడి తీవ్ర దుర్వాసన వెదజల్లిన పాత డంపింగ్ యార్డు వ్యర్థాలను తొలగించి, జిందాల్ వేస్ట్–టు–ఎనర్జీ ప్లాంట్‌కు తరలించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు తెలిపారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు, పారిశుద్ధ్యాన్ని కాపాడేందుకు ప్రజలంతా సహకరించాలని కోరుతూ, పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, మాజీ మున్సిపల్ చైర్మన్/మాజీ మున్సిపల్ కమిషనర్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అల్లూరి సుబ్బారావు, ఏపీ బులియన్ మర్చంట్ అధ్యక్షుడు కపిలవాయి విజయ్ కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, కూటమి నాయకులు బండారుపల్లి విశ్వేశ్వరరావు, కొట్టా కిరణ్ కుమార్, మున్సిపల్ ఇంజనీర్ షేక్ మహమ్మద్ రఫీ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత దృష్ట్యా బస్సు డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

**పల్నాడు జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్**



**నరసరావుపేట, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థుల క్షేమమే పరమావధిగా భావించి బస్సు డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో ఎల్లవేళలా అత్యంత అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) జి.సంజీవ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కాలేజీ ఆడిటోరియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన సదస్సును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ నేత్రాలయ సౌజన్యంతో సుమారు 300 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలతో పాటు పలు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా జిల్లా ప్రజా రవాణా అధికారి అజిత్ కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ మాధవీలత పర్యవేక్షణలో రెడ్ క్రాస్ సంస్థ తరపున రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన బాధితులకు అత్యవసర సమయాల్లో ప్రాణవాయువులా ఉపయోగపడే రక్తాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన దాతలకు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శ్రీనివాస గుప్తా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె. జగదీష్, పల్మనాలజిస్ట్ డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణపై తగిన సూచనలు చేయగా, ట్రాఫిక్ సీఐ లోకనాథం రద్దీ వేళల్లో పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలు, క్రమశిక్షణతో కూడిన పార్కింగ్ విధానాలపై దిశానిర్దేశం చేశారు. రోడ్ సేఫ్టీ నిపుణులు హనీఫ్, జమలయ్యలతో పాటు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) ఎన్. శివనాగేశ్వరరావు, కె. కమలాకరన్, గోపాల్, వంశీకృష్ణ, పవన్ కుమార్‌లు వాహనాల ఫిట్‌నెస్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా రహదారి భద్రత కమిటీ సభ్యురాలు ఆర్.కె.దుర్గా పద్మజ మాట్లాడుతూ డ్రైవర్లు ఈ ఆరోగ్య, కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులను కాపాడేందుకు అత్యంత కీలకమైన సీపీఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేస్తూ డ్రైవర్లకు ప్రత్యక్ష శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చిన్నారి తలపై నుంచి వెళ్లిన బస్సు

**ముప్పాళ్ల, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** ముప్పాళ్ల మండలం లంకలకూరపాడులో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. స్కూల్ బస్సు కింద పడి రెండున్నరేళ్ల చిన్నారి కోడవాటి నితిన్ మృతి చెందాడు. పెద్ద కుమారుడు సిద్ధార్థను స్కూల్ బస్సు ఎక్కించేందుకు తల్లి రాజకుమారి, చిన్న కుమారుడు నితిన్‌ను వెంట తీసుకుని వచ్చింది. ఈ సమయంలో నితిన్ బస్సు ముందుకు వెళ్లినట్లు సమాచారం. డ్రైవర్ గమనించకపోవడంతో బస్సు ముందుకు కదలగా చిన్నారి టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



**నరసరావుపేట , సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు డి శివ కుమారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను సచివాలయాల్లో పని దినాల్లో కూర్చోబెట్టడం వల్ల క్షేత్ర స్థాయి సేవలకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. లెప్రసీ సర్వేను ఆశా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో నిర్వహించి నోట్ బుక్‌లో వివరాలను నమోదు చేస్తున్నారని, వాటిని తిరిగి ఆన్ లైన్ యాప్ లో నమోదు చేయాలని ఒత్తిడి చేయడం వల్ల పనిభారం పెరుగుతుందన్నారు. భౌతికంగా రికార్డులు రాయడంతో పాటు యాప్ లోనూ వివరాలు నమోదు చేయాలనే నిబంధనలను మినహాయించాలని కోరారు.ఇప్పటికే ఆశా యాప్‌లో అవసరమైన సమాచారాన్ని నమోదు చేస్తున్నామని తెలిపారు. ఆశా కార్యకర్తలు ఒకటి, రెండు రోజులు కుటుంబ అవసరాల కోసం సెలవు తీసుకోవాలన్నా ఇతర ఆశా కార్యకర్తకు బాధ్యతలు అప్పగించి, వారి సంతకం తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కారం కోసం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వచ్చే నెల 6వ తేదీన నిర్వహించనున్న ఆశా డే కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఆశా వర్కర్లు తెలిపారు. ఆశా వర్కర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఆశా డే కార్యక్రమానికి దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆశా వర్కర్లు కోరారు. ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఎం.రత్న కుమారి జిల్లా కోశాధికారి ఎం.ధనలక్ష్మి షేక్.జరీనా తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతకు రాజీ వద్దు

**గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్**



**గుంటూరు, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** గుంటూరు నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, అదే సమయంలో నిర్దేశిత నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అరండల్‌పేట, భారత్‌పేట, విజయపురి కాలనీ, సీతయ్య డొంక తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనుల పురోగతిని పరిశీలించారు. నగరంలో కొత్తగా రోడ్లు, డ్రైన్లు నిర్మించే సమయంలో సంబంధిత ప్రతిపాదనలు పూర్తి స్థాయిలో రూపొందించాలని కమిషనర్ స్పష్టం చేశారు. డ్రైనేజీ లెవల్స్‌ను శాస్త్రీయంగా పరిశీలించి, వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్లు, యూజీడీ లైన్లను కూడా క్షుణ్ణంగా పరిగణనలోకి తీసుకోవాలని, పనులు పూర్తయిన తర్వాత మౌలిక వసతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏఈ, డీఈఈలు ప్రత్యేక బాధ్యత వహించాలని సూచించారు. అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే అక్కడ మిగిలిపోయే నిర్మాణ వ్యర్థాలను సంబంధిత కాంట్రాక్టర్లే తక్షణమే తొలగించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రోడ్లపై ఉన్న పాట్‌హోల్స్ (గుంతలు) అన్నింటినీ వెంటనే పూడ్చివేసి మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. టెండర్ అగ్రిమెంట్ నిబంధనల మేరకు, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తయిన పనులకు మాత్రమే బిల్లుల చెల్లింపు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. చెత్త సేకరణ కోసం కేటాయించిన ఈ–ఆటోలు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకల్లా ఫీల్డ్‌లోకి వెళ్లేలా చూడాలని, వాటి ట్రిప్పుల నివేదికను క్రమం తప్పకుండా అందజేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. నగర అందాన్ని దెబ్బతీసేలా గోడలపై అనధికారికంగా వాల్ పోస్టర్లు అంటించే వారిపై భారీ అపరాధ రుసుం (జరిమానా) విధించాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే వారిపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, ఈఈలు విష్ణువర్ధన్, వేణు, డీఈఈలు వెంకటరమణ, శ్రీనివాస్, చైతన్యతో పాటు ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 23 సెప్టెంబర్ 2026




# అడవి బాపిరాజు వర్ధంతి

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహితీ సాంస్కృతిక దశ దినోత్సవాలలో భాగంగా నాల్గోవ రోజైన మంగళవారం ఎస్ కే వి ఎస్ సీవీస్ జూనియర్ కళాశాలలో ప్రముఖ రచయిత, చిత్రకారుడు, పాత్రికేయుడు అడవి బాపిరాజు వర్ధంతి, మరియు సినిమా నేపథ్య గాయకుడు పి.బి శ్రీనివాస్ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వాసు అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్తలు డా.పీవీ సుబ్బారావు, బి.అజయ్ బాబు , డా. దార్ల బుజ్జిబాబు బాపిరాజు సాహితీ జీవనాన్ని వివరించారు. తొలుత వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహు ముఖ ప్రజ్ఞావంతుడు అడవి బాపిరాజు అని కొనియాడారు. ఆయన రాసిన నారాయణ రావు నవలకు ఆంధ్రా విశ్వ కళా పరిషత్ ప్రథమ బహుమతిని ఇచ్చిందన్నారు. ఇతడు గొప్ప చిత్రకారుడని, "బావబావ పన్నీరు బావను పట్టుకు తన్నీరు" అనే బాల గేయం రాసి బాపు బావ గా అనాటి సాహితీవేత్తలతో పిలువబడినారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జె.వి.వి. డివిజన్ అధ్యక్షులు ధూళిపాళ వెంకట రావు, చుక్క విన్సెంట్పాల్ కళాశాల అధ్యాపకులు ఈనాడు ప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# జగన్ వ్యాఖ్యల్లో వాస్తవాలు లేవు..

## రాజకీయాలకు ఆయన అనర్హుడు: కన్నా లక్ష్మీనారాయణ



**అమరావతి, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. టీచర్లను అవమానించే విధంగా జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయుల పట్ల గౌరవం లేకుండా మాట్లాడటం సరికాదని అన్నారు. జగన్ చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవాలు లేవని కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆయన చెబుతున్న విషయాలన్నీ అబద్ధాలేనని ఆరోపించారు. జగన్ రాజకీయాలకు అనర్హుడని వ్యాఖ్యానించారు. టీచర్లపై జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు.

# నిమజ్జనంలో ఇద్దరిపై దాడి



**యడ్లపాడు, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకల సమయంలో పాత కక్షలు భగ్గుమన్నాయి. గ్రామంలో నిమజ్జనం జరుగుతున్న సమయంలో పాతకక్షల నేపథ్యంలో గోరంట్ల భరత్ వాసు, గంగయ్యలపై కావట్టి మస్తానయ్య,నవీన్, అభిలాష్, మోహన్ రావు, అనే వారు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో భరత్ వాసు, గంగయ్యలు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు వారిని హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ బాధితులకు ప్రథమ చికిత్స అందించిన వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# విజయవాడలో ఉపాధ్యాయులపై దాడి హేయమైన చర్య

## నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆగ్రహం

**గుంటూరు, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** విజయవాడలోని శాప్ కార్యాలయం ముందు విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులపై జరిగిన దాడి అత్యంత హేయ-ంమైన చర్య అని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు తీవ్రంగా ఖండించారు. గుంటూరు నగరంలోని కావటి శంకరరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బొనిగల హైమారావు మాట్లాడుతూ.. ఆరోపణలు చేసే నాయకులు నిజానిజాలు తెలుసుకోవడానికి కోర్టులకు వెళ్లాలే తప్ప, ఇలా విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులపై దాడులు చేయించడం సరికాదని మండిపడ్డారు. గత రెండు నెలలుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని అధికారులు స్పష్టంగా ప్రకటిస్తున్నప్పటికీ, రాజకీయ ప్రయోజనాల కోసం దాడులకు తెగబడటం నీతిమాలిన చర్య అని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో ప్రతిష్టాత్మకంగా, పకడ్బందీగా, ఎలాంటి అనుమానాలకు తావులేకుండా మెగా డీఎస్సీ (ఞాజ) నిర్వహించారని కొనియాడారు. ఇలాంటి పారదర్శకమైన డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తూ దాడులు చేయడంతో ఉపాధ్యాయుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక భద్రతా చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు చేపట్టే ఉద్యమాలతో వైసీపీ (జూ) భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రకటనలో హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, మున్సిపల్ ఉపాధ్యాయుల రాష్ట్ర కన్వీనర్ పి. లలిత బాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కూరపాటి రాజా, గుంటూరు వెస్ట్ నగర అధ్యక్షుడు తుమాటి రవి మరియు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదు

## శాంతియుతంగా ధర్నా చేస్తున్న వారిపై పోలీసుల లాఠీచార్జ్ అమానుషం



**దాచేపల్లి, సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** పోలీసులతో ఎంత అణచివేయాలని చూసిన డిఎస్సీ లో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తునే ఉంటామని వైసిపి నాయకులు స్పష్టం చేశారు. డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సోమవారం విజయవాడ శాప్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తు పల్నాడు జిల్లా దాచేపల్లి వైసీపీ కార్యాలయం లో నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ లో అక్రమాలు జరగకపోతే సిబిఐ విచారణ కు చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం లో అణచివేత సమాధానం కాదని ఎక్కడయితే అణచివేత పెరుగుతుందో అక్కడ ఉద్యమాలు ఉవ్వెత్తున లేస్తాయన్నారు. రెండున్నర ఏళ్ళ నుండి కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, 2029 లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. అక్రమాలు జరిగాయని నిలదీస్తే పోలీసులతో లాఠీ చార్జ్ చేయించి అణచివేస్తారా అంటూ విమర్శించారు. డిఎస్సీ లో జరిగిన అక్రమాలకు భాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసేవరకు వైసీపీ పోరాడుతుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. నీట్ పరీక్ష లో జరిగిన అక్రమాలకు భాధ్యత వహిస్తు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసారని, మీరు నిర్వహించిన పోటీ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని సాక్ష్యాలతో సహా నిరూపిస్తే వాటిపై విచారణ జరపకుండా ఎదురుదాడి చేయటం ఈ ప్రభుత్వం, నారా లోకేష్ కే చెల్లిందని, ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం పరీక్ష నిర్వహించకుండా ఉద్యోగాలు ఇవ్వలేదని నాయకులు ఆరోపించారు. గతంలో హర్యానా రాష్ట్రం లో డిఎస్సీ లో జరిగిన అక్రమాలకు అక్కడి విద్యాశాఖ మంత్రి కి న్యాయస్థానాలు పదేళ్ళ శిక్ష విధించాయని, వైసిపి ప్రభుత్వం వచ్చినతరువాత డిఎస్సీ నియమాకాలపై విచారణ జరిపి ఎవరైతే అక్రమాలకు పాల్పడ్డారో వారందరిని చట్ట ప్రకారం శిక్షించడం జరుగుతుందని ఈ సందర్భంగా వైసిపి నాయకులు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ కొప్పుల సాంబయ్య, పార్టీ సీనియర్ నాయకులు మందపాటి రమేష్ రెడ్డి, ఎంపీపీ కందుల జాన్, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ సుభాని, నియోజవర్గ అధికార ప్రతినిధి షేక్ జాకీర్ హుస్సేన్,మండల పార్టీ అధ్యక్షులు కోట కృష్ణ, పార్టీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి జంగాల శింగరయ్య,పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు కోలా జంపాల రెడ్డి,వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్,ఆర్యవైశ్య విభాగం జిల్లా నాయకులు గరిణె పుల్లారావు, మండల యూత్ అధ్యక్షులు జక్కా ఆశోక్,మండల క్రిస్టియన్ విభాగం అధ్యక్షులు ముడి విక్టర్,నాయకులు కుందూరు తిరుపతి రెడ్డి,ముశ్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పురపోరుకు కాంగ్రెస్ సై

- చిలకలూరిపేటలో పట్టు కోసం వ్యూహాలు
- మున్సిపాలిటీలో గళం విప్పేందుకు కసరత్తు
- ఛైర్‌పర్సన్ రేసులో మైనార్టీ, ఎస్సీ, కాపు వర్గాలు?
- కనీసం 10 వార్డులే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** పట్టణ పురపాలక ఎన్నికల సమరానికి కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరిస్తోంది. ఒకప్పుడు చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అధిరోహించిన ఘన చరిత్ర ఉన్న కాంగ్రెస్, ప్రస్తుత ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటి మున్సిపాలిటీలో తమ ఉనికిని, గళాన్ని బలంగా వినిపించాలని చూస్తోంది. ఇందుకు అనుగుణంగా పార్టీ కేడర్ రంగంలోకి దిగి ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది.

### ఛైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపికపై అంతర్గత మంతనాలు

స్థానిక కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశంలో ఛైర్‌పర్సన్ అభ్యర్థిత్వ ఎంపికపై కీలక చర్చ జరిగినట్లు సమాచారం. తొలి ప్రాధాన్యతగా ముస్లిం మైనార్టీ వర్గానికి లేదా ఎస్సీ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మూడో ప్రత్యామ్నాయంగా కాపు సామాజిక వర్గానికి అవకాశం కల్పించే అంశంపైనా అంతర్గతంగా సమాలోచనలు సాగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



### 10 వార్డులపై ప్రత్యేక గురి

పట్టణ పరిధిలోని మొత్తం 48 వార్డుల్లో ఆచితూచి అడుగులు వేయాలని నాయకత్వం భావిస్తోంది. గతంలో కాంగ్రెస్ వైపు బలంగా నిలబడిన మైనార్టీలు, ఎస్సీలతో పాటు ఇతర అనుకూల వర్గాల ఓటు బ్యాంకు ఉన్న వార్డులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. వ్యూహాత్మకంగా ఆయా ప్రాంతాల్లో ఓట్లను కొల్లగొట్టి, కనీసం 10 వార్డుల్లో అయినా విజయకేతనం ఎగురవేయాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇప్పటికే కొన్ని కీలక వార్డుల్లో నలుగురు అభ్యర్థుల పేర్లను పార్టీ ప్రాథమికంగా పరిశీలనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల వేళ చిలకలూరిపేట కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా దూకుడు పెంచడం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.



# కార్ పార్కింగ్‌గా మారిన సబ్ రిజిస్టార్ కార్యాలయం

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 22 (స్పందన న్యూస్):** స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం గేటుకు అడ్డుగా మంగళవారం ఉదయం నుంచి కారు నిలిపి ఉం డటంతో కార్యాలయ సిబ్బంది, ప్రజల కార్యాల యం లోపలికి బైటకి రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగింది. గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ఉదయం ఏపీ 02 ఎన్ 7707 నంబరు గల కారును ఇక్కడ నిలిపి ఉంచారు.కారుపై ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని వ్రాసి ఉండటం గమనార్హం. మధ్యా హ్నం రెండు గంటల వరకు సంబంధిత వ్యక్తులు కారును అక్కడి నుండి తీయక పోవడంతో కార్య లయ సిబ్బంది పోలీసుల కు పిర్యాదు చెయ్యటంతో వారు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. టోయింగ్ వాహనంతో కారును అక్కడి నుంచి స్టేషన్ వద్దకు తరలించారు.

# మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికలపై ఉత్కంఠ

- 24న హైకోర్టు తీర్పుపైనే సర్వత్రా నిరీక్షణ
- ఎన్నికల నిర్వహణపై కొనసాగుతున్న సస్పెన్స్

**మంగళగిరి, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ (ఎంటీఎంసీ) పరిధిలో ఎన్నికల నిర్వహణపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కసరత్తు సాగుతున్న నేపథ్యంలో, ఎంటీఎంసీ ఎన్నికల అంశం మాత్రం న్యాయస్థానంలో ఉన్న కేసు కారణంగా ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీలతో పాటు పరిసర ప్రాంతాలను విలీనం చేస్తూ 2021 మార్చిలో మంగళగిరి--తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. అయితే ఈ విలీన ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించడంతో గత ఐదేళ్లుగా ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగలేదని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కార్పొరేషన్‌కు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న అంశంపై ప్రజలు, రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

### 24న కోర్టు తీర్పుపైనే నిరీక్షణ

కార్పొరేషన్ ఏర్పాటు, విలీన ప్రక్రియకు సంబంధించిన కేసుపై ఈ నెల 24వ తేదీన హైకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం ఉందన్న అంచనాలు నెలకొన్నాయి. న్యాయస్థానం నిర్ణయం వెలువడిన తర్వాతే ఎంటీఎంసీ ఎన్నికల విషయంలో తదుపరి చర్యలపై స్పష్టత వస్తుందని, అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం తుది నిర్ణయం తీసుకునే పరిస్థితి ఉంటుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

### రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సందడి

ఇదిలా ఉండగా రాష్ట్రంలోని ఇతర పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికార యంత్రాంగం కసరత్తు కొనసాగిస్తోంది. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు వంటి అంశాలపై




అధికారులు దృష్టి సారిస్తున్నారు. దీంతో ఎంటీఎంసీ మినహా మిగిలిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఏ విధంగా ముందుకు సాగుతుందన్న దానిపైనా ఆసక్తి నెలకొంది.

### డైరెక్ట్ ఎలక్షన్, రాజకీయ వ్యూహాలు

ఈసారి మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ఓటర్లు నేరుగా ఎన్నుకునే విధానానికి సంబంధించి ప్రభుత్వం చట్టపరమైన మార్పులు తీసుకువచ్చిన నేపథ్యంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీల్లో ఆసక్తి పెరిగింది. ఎంటీఎంసీ ఎన్నికలు కూడా నిర్వహించే పరిస్థితి ఏర్పడితే, మేయర్ పదవితో పాటు కార్పొరేటర్ స్థానాలపై రాజకీయ పార్టీల వ్యూహాలు కీలకంగా మారనున్నాయి.

### మంగళగిరిపై ప్రత్యేక దృష్టి

మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఎంటీఎంసీ ఉండటంతో ఈ కార్పొరేషన్ ఎన్నికలకు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నికలు జరుగుతాయనే అంచనాలతో అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ వర్గాల్లో స్థానిక స్థాయిలో అభ్యర్థుల ఎంపిక, వార్డు సమీకరణాలు, రాజకీయ వ్యూహాలపై తీవ్ర చర్చలు సాగుతున్నాయి.

### 24 తర్వాతే తుది స్పష్టత

ప్రస్తుతం ఎంటీఎంసీ ఎన్నికలపై ప్రధానంగా న్యాయపరమైన పరిణామాలపైనే దృష్టి కేంద్రీకృతమైంది. ఈ నెల 24న హైకోర్టులో వెలువడే నిర్ణయం అనంతరం ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కోర్టు నుంచి అనుకూలమైన నిర్ణయం వచ్చిన పక్షంలో రాష్ట్రంలోని ఇతర స్థానిక సంస్థలతో పాటు ఎంటీఎంసీ ఎన్నికల ప్రక్రియ కూడా ముందుకు సాగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఆసియా క్రీడల్లో మహిళల జట్టుకు స్వర్ణ పతకం



**నిషిన్ (జపాన్) సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** ఆసియా క్రీడలు 2026 మహిళల క్రికెట్ పోటీలలో భారత జట్టు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. నిషిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన శ్రీలంక జట్టుపై 147 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. రికార్డు స్థాయి స్కోరు మరియు బ్యాటింగ్ ధనాధన్తాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆసియా క్రీడల మహిళల క్రికెట్ చరిత్రలోనే ఇది అత్యధిక స్కోరుగా నమోదైంది. భారత ఓపెనర్లు స్మృతి మంధాన (45 బంతుల్లో 79), షఫాలీ వర్మ (48) తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి బలమైన పునాది వేశారు. ఈ ఇన్నింగ్స్ క్రమంలో స్మృతి మంధాన అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో 11,000 పరుగుల మైలురాయిని చేరుకోగా, ముగింపులో రిచా ఘోష్ (22 బంతుల్లో 49 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో జట్టుకు తిరుగులేని స్కోరు అందించింది. కుప్పకూలిన శ్రీలంక బ్యాటింగ్217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు భారత బౌలర్ల ధాటికి తాళలేకపోయింది. కేవలం 15.4 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో టీమిండియా ఆసియా క్రీడల్లో పసిడి పతకాన్ని ముద్దాడి మరోసారి తన ఆధిక్యాన్ని చాటుకుంది.




# అంతర్జాతీయ క్రికెట్‌లో స్మృతి మంధాన రికార్డు

**నిషిన్ (జపాన్) సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** భారత మహిళా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో మరో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఆసియా క్రీడలు 2026లో భాగంగా శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులో 79 పరుగులతో రాణించిన ఆమె, అంతర్జాతీయ క్రికెట్‌లో 11,000 పరుగుల మైలురాయిని వేగంగా పూర్తి చేసుకున్న తొలి మహిళా క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు నమోదు చేసింది.

ఈ మ్యాచ్‌కు ముందు 10,987 పరుగులతో ఉన్న స్మృతి (టెస్టుల్లో 788, వన్డేల్లో 5,411, టీ20ల్లో 4,788), ఇన్నింగ్స్ ఆరంభంలోనే మూడో ఓవర్లో సిక్సర్ బాదడం ద్వారా ఈ ఘనతను సాధించింది. మహిళల క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలోనూ అత్యంత విజయవంతమైన బ్యాటర్‌గా కొనసాగుతున్న మంధాన, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా ఇప్పటికే తన పేరుపై పలు రికార్డులను కలిగి ఉంది. ఆమె సాధించిన అర్ధశతకం తోడ్పాటుతో భారత్ 147 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను ఓడించి ఆసియా క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా వరుసగా రెండోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

# జపాన్ చేతిలో భారత్‌కు త్రుటిలో షాక్



**సానో (జపాన్) సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** ఆసియా క్రీడల నేపథ్యంలో సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జపాన్‌తో జరిగిన చారిత్రాత్మక టీ20 మ్యాచ్‌లో భారత పురుషుల క్రికెట్ జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో విజయాన్ని అందుకుంది. పసికూన జపాన్ అద్భుత పోరాట పటిమ కనబరచడంతో ఆఖరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో టీమిండియాకు అనూహ్య పరాభవం త్రుటిలో తప్పింది. ఈ విజయంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో (సూపర్ ఓవర్లతో కలిపి) 200వ విజయాన్ని నమోదు చేసిన తొలి జట్టుగా భారత పురుషుల జట్టు కొత్త రికార్డు సృష్టించింది.వర్షం కారణంగా చెరో 5 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్‌ను జపాన్ బౌలర్లు తీవ్రంగా కట్టడి చేసి 32 పరుగులకే పరిమితం చేశారు. ముఖ్యంగా జపాన్ కుర్రాడు చార్లీ హింజే 2 వికెట్లు తీసి రాణించాడు. అనంతరం 33 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ జట్టు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ వంటి ప్రపంచస్థాయి స్పిన్నర్లను ఎదుర్కొంటూ 30 పరుగులు సాధించి ఓటమి అంచుల వరకు వచ్చింది. మ్యాచ్ అనంతరం జపాన్ కెప్టెన్ కెండెల్ కడోవాకి-ఫ్లెమింగ్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టును చివరి బంతి వరకు నిలువరించడం తమకు గర్వకారణమని, భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తమ పురోగతిని ప్రశంసించడం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నాడు.

# ఓటమి నుంచి టీమిండియాను కాపాడిన ఆల్ రౌండర్ అక్షర్

**సానో (జపాన్), సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** ఆసియా క్రీడలకు సన్నాహకంగా జపాన్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరిగిన చారిత్రాత్మక టీ20 మ్యాచ్‌లో భారత పురుషుల క్రికెట్ జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో విజయాన్ని సాధించింది. వర్షం కారణంగా చెరో 5 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు మాత్రమే చేయగలిగింది. అభిషేక్ శర్మ పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరగగా, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ విఫలమయ్యారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సాధించిన 16 పరుగులే జట్టులో అత్యధికం కావడం గమనార్హం.

## అక్షర్ పటేల్ చివరి ఓవర్ విన్యాసం

33 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ బ్యాటర్లు భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ విజయం దిశగా సాగారు. చివరి ఓవర్లో జపాన్ విజయానికి 8 పరుగులు అవసరమైన తరుణంలో, భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చెలరేగుతున్న జపాన్ బ్యాటర్లను అడ్డుకునే బాధ్యతను స్టార్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు అప్పగించారు. తీవ్ర ఒత్తిడి నెలకొన్న ఆఖరి ఓవర్లో అక్షర్ పటేల్ తన అనుభవాన్నంతటినీ ఉపయోగించి కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. తొలి రెండు బంతులను డాట్ చేయగా, వైడ్ ద్వారా ఒక పరుగు వచ్చినప్పటికీ తర్వాతి బంతుల్లో సింగిల్స్ మాత్రమే ఇచ్చారు. ఆఖరి బంతికి 4 పరుగులు అవసరమైన సమయంలో అక్షర్ తెలివిగా వేసిన నెమ్మదైన బంతిని బ్యాటర్ సరిగ్గా కనెక్ట్ చేయలేకపోవడంతో కేవలం ఒక పరుగు మాత్రమే వచ్చింది. దీంతో జపాన్ 5 ఓవర్లలో 30 పరుగులకు పరిమితమవ్వగా, భారత్ 2 పరుగుల తేడాతో విజయం సాధించి పరువు నిలబెట్టుకుంది.



# అంతర్జాతీయ క్రికెట్‌కు మార్క్ వుడ్ వీడ్కోలు

**లండన్, సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** ఇంగ్లాండ్ స్టార్ పేసర్ మార్క్ వుడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గాయాల కారణంగా గత ఏడాది కాలంగా ఆటకు దూరంగా ఉన్న 36 ఏళ్ల వుడ్‌కు ఇక టెస్టులు, వన్డేలు ఆడటం సాధ్యం కాదని వైద్యులు సూచించడంతో ఈ నిర్ణయం తీసుకున్నాడు. 2015లో న్యూజిలాండ్‌తో లార్డ్స్‌లో జరిగిన టెస్టుతో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వుడ్.. 38 టెస్టుల్లో 119 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ తరఫున నాలుగు యాషెస్ సిరీస్‌ల్లో ఆడిన అతడు.. 70 వన్డేల్లో 80 వికెట్లు సాధించాడు. 2019 వన్డే ప్రపంచకప్ విజయంలో వుడ్ కీలక పాత్ర పోషించాడు. ఆ టోర్నీలో 18 వికెట్లు తీసిన అతడు.. 2022 టీ20 ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. ఆ టోర్నీలో నాలుగు మ్యాచ్‌ల్లో 9 వికెట్లు పడగొట్టాడు. టీ20 అంతర్జాతీయాల్లో 38 మ్యాచ్‌లు ఆడి 54 వికెట్లు సాధించాడు. గాయాల నుంచి తిరిగి వచ్చి జట్టులోకి రావడానికి ఎంతో ప్రయత్నించానని వుడ్ తెలిపాడు. "ఇది నాకు సహజమైన ముగింపులా అనిపించింది. ఇంగ్లాండ్ తరఫున ఆడటం నా జీవితంలో గొప్ప గౌరవం" అని పేర్కొన్నాడు. వుడ్ సేవలను ఇంగ్లాండ్ పురుషుల క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ కొనియాడుతూ.. యాషెస్, రెండు ప్రపంచకప్ విజయాల్లో అతడి పాత్రను గుర్తుచేసుకున్నాడు.



## ఆసియా క్రీడల్లో మహిళల బ్యాడ్మింటన్ జట్టు నిష్క్రమణ

**నాగోయా (జపాన్), సెప్టెంబరు 22:** ఆసియా క్రీడలు 2026 మహిళల బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో భారత ప్రయాణం క్వార్టర్ ఫైనల్స్‌లోనే ముగిసింది. మంగళవారం జరిగిన కీలక క్వార్టర్ ఫైనల్ పోరులో ఆతిథ్య జపాన్ చేతిలో భారత్ 1-3 తేడాతో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. మొదటి సింగిల్స్ మ్యాచ్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, జపాన్ స్టార్ క్రీడాకారిణి అకానె యమగుచి మధ్య హోరాహోరీ పోరు సాగింది. తొలి గేమ్‌ను 23-21తో కైవసం చేసుకున్న సింధు, ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లను 18-21, 11-21 తేడాతో ప్రత్యర్థికి సమర్పించుకోవడంతో జపాన్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత జరిగిన రెండో సింగిల్స్ మ్యాచ్‌లో భారత యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా 16-21, 18-21 తేడాతో టొమోకా మియాజాకి చేతిలో ఓటమి పాలవ్వడంతో జపాన్ ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో మ్యాచ్‌లో బరిలోకి దిగిన భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ - గాయత్రి గోపీచంద్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. జపాన్‌కు చెందిన యుకీ ఫుకుషిమా - మయు మత్సుమోటో జోడీపై 21-17, 21-16 తేడాతో నేరుగా రెండు గేమ్‌లలో విజయం సాధించి భారత్‌ను 1-2తో పోటీలో నిలిపారు. అయితే, నిర్ణయాత్మక నాలుగో మ్యాచ్‌లో తాన్వి శర్మ 12-21, 10-21 తేడాతో జపాన్ క్రీడాకారిణి నోజోమి ఒకుహారా చేతిలో పరాజయం పాలైంది. దీంతో జపాన్ 3-1 తేడాతో విజయాన్ని ఖాయం చేసుకుని సెమీఫైనల్‌కు చేరుకోగా, భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌తోనే తమ పోరాటాన్ని ముగించింది.

# రిజ్వాన్‌పై పీసీబీ ఆంక్షలు

**లాహోర్, సెప్టెంబరు 22:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరియు నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సీసీఐఏ) సంయుక్తంగా జరుపుతున్న ఆన్‌లైన్ జూదం, అవినీతి ఆరోపణల విచారణ వ్యవహారంలో సీనియర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌పై తీవ్ర ఆంక్షలు విధించబడ్డాయి. ఇంగ్లండ్ పర్యటన మధ్యలోనే స్వదేశానికి రప్పించిన ఏడుగురు ఆటగాళ్లలో ఒకరైన రిజ్వాన్, తనపై వచ్చిన ఆరోపణలపై మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చేందుకు పీసీబీని రెండుసార్లు అనుమతి కోరగా, బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలను చూపిస్తూ ఆ అభ్యర్థనలను నిరాకరించింది. విచారణ ప్రక్రియలో భాగంగా పీసీబీ భద్రతా బృందం స్వాధీనం చేసుకున్న రిజ్వాన్ మరియు ఇమామ్-ఉల్-హక్‌ల మొబైల్ ఫోన్లను ఇప్పటికీ తిరిగి ఇవ్వకుండా, వాటిలోని ఆర్థిక లావాదేవీలు మరియు సంభాషణలపై లోతైన ఫోరెన్సిక్ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో రిజ్వాన్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అవినీతి నిరోధక విభాగానికి లేఖ రాస్తూ, ఈ విచారణలో సరైన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై స్పష్టత కోరారు. అలాగే, విచారణకు పూర్తిగా సహకరిస్తానని, అయితే తనపై ఉన్న ఆరోపణల స్పష్టమైన వివరాలను ముందుగా అందించాలని ఆయన ఎన్‌సీసీఐఏకు విజ్ఞప్తి చేశారు.



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 23 సెప్టెంబర్ 2026



# నా వల్ల కాలేదు!

## 'ది ప్యారడైజ్' కథానాయిక కయాదు లోహర్ వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ది ప్యారడైజ్' విడుదల కాబోతున్న నేపథ్యంలో, ఆ చిత్రంలో నాని సరసన 'సుబ్బలక్ష్మి' (సుబ్బు) పాత్రలో నటించిన పరభాషా నటి కయాదు లోహర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మీడియాతో ముచ్చటించిన ఆమె, చిత్రంలో తెలంగాణ యాస పలకడంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. సాధారణంగా పరభాషా కథానాయికలు తమ సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పుకుని స్థానిక ప్రేక్షకులకు దగ్గరవ్వాలని ఆశిస్తుంటారు. కయాదు లోహర్ కూడా 'ది ప్యారడైజ్' కోసం సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, చివరకు తెలంగాణ యాస ముందు చేతులెత్తేసినట్లు వెల్లడించారు. సాధారణ తెలుగును నేర్చుకుని మాట్లాడటం సులభమే అయినప్పటికీ, ఈ సినిమాలో కథా నేపథ్యానికి అవసరమైన పక్కా నేటివిటీతో కూడిన స్వచ్ఛమైన తెలంగాణ మాండలికాన్ని పలకడం తనకు ఏమాత్రం సాధ్యపడలేదని చెప్పారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కూడా ఒకసారి డబ్బింగ్ ప్రయత్నించి చూద్దామని ప్రోత్సహించినప్పటికీ, ఎంత ప్రయత్నించినా ఆ స్లాంగ్ సెట్ కాకపోవడంతో డబ్బింగ్ నిర్ణయాన్ని విరమించుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. పాత్ర సహజత్వం దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కథానాయిక స్పష్టం చేశారు.



# జాతీయ వేదికపై తెలుగు సినిమా జయకేతనం

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం వైభవం

- తెలుగు చిత్రాలకు తొమ్మిది పురస్కారాలు
- 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప-2', '35' చిత్రాలకు రెండేసి
- ఉత్తమ తెలుగు చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'
- మమ్ముట్టి, కార్తిక్ ఆర్యన్‌కు ఉత్తమ నటుల పురస్కారం
- యామీ గౌతమ్‌కు ఉత్తమ నటి.. అనంత్ నాగ్‌కు ఫాల్కే పురస్కారం

**ఏక్తానగర్, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** భారతీయ సినీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో మంగళవారం వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా విజేతలు పురస్కారాలు అందుకున్నారు. ఈసారి తెలుగు సినిమా జాతీయ వేదికపై సత్తా చాటింది. వివిధ విభాగాల్లో తెలుగు చిత్రాలు మొత్తం తొమ్మిది పురస్కారాలను సొంతం చేసుకున్నాయి. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌కు భారతీయ సినిమాకు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని రాష్ట్రపతి ప్రదానం చేశారు. 'భ్రమయుగం' చిత్రంలో నటనకు మమ్ముట్టి, 'చందూ ఛాంపియన్' చిత్రంలో నటనకు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుల పురస్కారాలను అందుకున్నారు. 'ఆర్టికల్ 370'లో నటనకు యామీ గౌతమ్ ఉత్తమ నటిగా నిలిచారు. 'ఆర్టికల్ 370' ఉత్తమ ఫీచర్ చిత్రంగా ఎంపిక కాగా, 'అమరన్'కు రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకున్నారు.

### తెలుగు సినిమాకు తొమ్మిది పురస్కారాలు

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్ర పరిశ్రమ తొమ్మిది అవార్డులతో మెరిసింది. 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప: ది రూల్ పార్ట్-2', '35.. చిన్న కథ కాదు' చిత్రాలకు రెండేసి పురస్కారాలు దక్కాయి. 'కమిటీ కుర్రోళ్లు' కూడా రెండు విభాగాల్లో అవార్డులు సాధించగా, 'లక్కీ భాస్కర్'కు ఒక పురస్కారం లభించింది. 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రంగా నిలిచింది. ఇదే చిత్రానికి నితిన్ జిహానీ చౌధరి ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్‌గా పురస్కారం అందుకున్నారు. 'పుష్ప-2' చిత్రానికి ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగంలో సుకుమార్‌కు పురస్కారం దక్కగా, అదే చిత్రానికి దీపాలి నూర్, శీతల్ శర్మ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా అవార్డు అందుకున్నారు.

### '35'కు రెండు.. 'కమిటీ కుర్రోళ్లు'కు రెండు

'35.. చిన్న కథ కాదు' ఉత్తమ బాలల చిత్రంగా జాతీయ పురస్కారం సాధించింది. ఇదే చిత్రంలో నటించిన అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాల నటుడి పురస్కారాన్ని పంచుకున్నారు. 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కాగా, ఇదే సినిమాకు పి. రవికుమార్ ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా అవార్డు అందుకున్నారు. 'లక్కీ భాస్కర్' చిత్రానికి వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా జాతీయ పురస్కారం అందుకున్నారు. దీంతో తెలుగు సినిమాకు దక్కిన పురస్కారాల సంఖ్య తొమ్మిదికి చేరింది.

### ఢిల్లీ దాటి తొలిసారి గుజరాత్‌లో

జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవానికి ఈసారి గుజరాత్‌లోని ఏక్తానగర్ వేదికైంది. సాధారణంగా ఢిల్లీలో జరిగే ఈ వేడుకను ఈసారి ఏక్తానగర్‌లో నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా దేశవ్యాప్తంగా వివిధ భాషలకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు పురస్కారాలను అందుకున్నారు.

### తెలుగు విజేతలు వీరే

**కల్కి 2898 ఏడీ**
ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రం, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్

**పుష్ప-2**
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్

**35.. చిన్న కథ కాదు**
ఉత్తమ బాలల చిత్రం, ఉత్తమ బాల నటుడు

**కమిటీ కుర్రోళ్లు**
ఉత్తమ తెలుగు చిత్రం, ఉత్తమ మేకప్

**లక్కీ భాస్కర్**
ఉత్తమ సంభాషణల రచన











# హీరోయిన్లకు కాంపిటీషన్ ఇచ్చేలా!

## శ్రీను వైట్ల డాటర్ ఆనంది...

**హైదరాబాద్, సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శ్రీను వైట్ల పెద్ద కుమార్తె ఆనంది వైట్ల సోషల్ మీడియాలో పంచుకున్న లేటెస్ట్ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట తీవ్రంగా వైరల్ అవుతున్నాయి. సరికొత్త కామెడీ ట్రెండ్‌తో 'ఆనందం', 'వెంకీ', 'ఢీ', 'రెడీ', 'దూకుడు' వంటి ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన శ్రీను వైట్ల ప్రస్తుతం శర్వానంద్‌తో 'జార్జ్ క్రిష్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, ఆయన కుమార్తె ఆనంది తన ఫ్యాషన్ సెన్స్‌తో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. నిత్యం డిఫరెంట్ ఫ్యాషన్ స్టేట్‌మెంట్లు, గ్లామరస్ ఫోటోషూట్లతో ఇంటర్నెట్‌లో క్రేజ్ తెచ్చుకుంటున్న ఆనంది, తాజాగా బ్లాక్ కలర్ సీ-త్రూ షీర్ డ్రెస్‌లో పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇంటర్నేషనల్ పాప్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్‌తో మోడ్రన్ అండ్ స్టైలిష్ వైబ్‌లో ఆమె ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆనంది లుక్స్ చూసిన నెటిజన్లు "హాలీవుడ్ మోడల్ రేంజ్ లుక్స్", "హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని అందం" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. తండ్రి ఇండస్ట్రీలో స్టార్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న నేపథ్యంలో, తనదైన గ్లామర్, మోడ్రన్ అప్పీల్‌తో మెరుస్తున్న ఆనంది వైట్ల త్వరలోనే వెండితెరకు హీరోయిన్‌గా పరిచయమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



# త్వరలోనే నంది అవార్డుల వేడుక

## అమరావతిలో సినిమాలు..
## తిరుపతిలో టీవీ పురస్కారాలు..

### 2017--2024 పెండింగ్ కాలానికి ఏటా నాలుగే పురస్కారాలు

### ఏపీ ఎఫ్‌డీసీ ఛైర్మన్ భరత్ భూషణ్ స్పష్టత

**అమరావతి, సెప్టెంబరు 22 (స్పంద న్యూస్):** తెలుగు సినీ కళాకారులు, సాంకేతిక నిపుణులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అత్యున్నత 'నంది అవార్డుల' ప్రదానోత్సవానికి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. గత దశాబ్ద కాలంగా నిలిచిపోయిన ఈ పురస్కారాల పంపిణీ ప్రక్రియకు ఎట్టకేలకు మోక్షం కలిగిస్తూ ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కీలక ప్రకటన చేసింది. ఇందులో భాగంగా సినిమా రంగానికి సంబంధించిన నంది అవార్డుల వేడుకను రాజధాని అమరావతి వేదికగా, టెలివిజన్ రంగానికి చెందిన పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, 2017 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న ఎనిమిదేళ్ల కాలానికి సంబంధించి ప్రభుత్వం ఒక ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఇచ్చే పదుల సంఖ్యలోని కేటగిరీలన్నింటినీ ఎనిమిదేళ్ల వ్యవధిలోని చిత్రాలకు వేర్వేరుగా పరిశీలించడం సాంకేతికంగా, ఆచరణాత్మకంగా అసాధ్యమని భావించినట్లు ఏపీ ఎఫ్‌డీసీ ఛైర్మన్ భరత్ భూషణ్ వివరించారు. అందువల్ల ఆ మధ్యంతర సంవత్సరాలకు గానూ ఏటా కేవలం నాలుగు అవార్డులు (ఉత్తమ చిత్రం, ద్వితీయ ఉత్తమ చిత్రం, మరొక రెండు ప్రత్యేక జ్యూరీ అవార్డులు) మాత్రమే ప్రదానం చేయనున్నట్లు స్పష్టం చేశారు. దీంతో ఆ ఏడేళ్ల కాలంలో నటన, దర్శకత్వం, సాంకేతిక




విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి వ్యక్తిగత నంది అవార్డులు దక్కే అవకాశం లేకుండా పోవడంతో పరిశ్రమ వర్గాల్లో ఇది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, 2012 నుంచి 2016 కాలానికి సంబంధించి అప్పట్లో ప్రకటించి నిలిచిపోయిన 288 సినీ, 51 జ్యూరీ అవార్డులతో పాటు టెలివిజన్ రంగానికి చెందిన 330 పురస్కారాలను బాకీ లేకుండా అందజేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఇక 2025 నుంచి ఎలాంటి కోతలు లేకుండా ఎప్పటిలాగే అన్ని విభాగాల్లోనూ పూర్తిస్థాయి నంది అవార్డులను యథావిధిగా కొనసాగిస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'గద్దర్ అవార్డుల'తో దీనికి ఎలాంటి సంబంధం లేదని, అక్కడ సత్కారం పొందిన సినిమాలు కూడా ఇక్కడ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈసారి నంది అవార్డుల నగదు ప్రోత్సాహకాన్ని కూడా పెంచుతూ ప్రత్యేక జీవో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 23 సెప్టెంబర్ 2026



## ఒంగోలులో గ్రామీణ వైద్యుల మహాసభ

**యడ్లపాడు, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** ది రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు గల్లా మురళీకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రామీణ వైద్యుల మరియు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ ఒంగోలు త్రోవకుంట వద్దగల బృందావన్ గార్డెన్స్ నందు గ్రామీణ వైద్యుల జేఏసి మహాసభ ఏర్పాటు చేశామని .సుదీర్ఘకాలం నుండి గ్రామీణ, మారుముల పల్లె గ్రామాల ప్రజలకు అత్యవసర వైద్య సేవల కు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ గ్రామీణ వైద్యులు జీవనం కొనసాగిస్తున్నారని, వారి వృత్తి పరిరక్షణ మరియు గుర్తింపు కొరకు చేస్తున్నటువంటి పోరాటం ప్రభుత్వం నుండి సానుకూల దృక్పథంతో గ్రామీణ వైద్యుల గుర్తింపు పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ జేఏసీ సమావేశానికి రాష్ట్ర జేఏసీ ప్రతినిధులు టీడీ జనార్దన్, డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, ఉమ్మడి ప్రకాశం జిల్లా రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు పాల్గొనే ఈ సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిసర జిల్లాల గ్రామీణ వైద్యులందరూ కూడా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. గ్రామీణ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రాథమిక వైద్య సంఘాల సమాఖ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు యామర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరెళ్ల గణపతి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో సభ్యులు ఖలీఫా తుల్లా, ఎస్ మారుతీ కృష్ణ,కె శ్రీనివాసరావు, ఎం సుదర్శన్ రావు, కె రామకృష్ణ, జి సుధాకర్, షేక్ జాన్ సైదా, జి గోపి, ఎస్ రాజేశ్వరి, షేక్ మీను సుల్తానా పాల్గొన్నారు

## హిందువులకు ప్రాముఖ్యమైన పండుగ వినాయక చవితి

**ఎమ్మెల్యే మద్దులూరి కొండయ్య**



**చీరాల, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** కోట్ల బజార్ లక్ష్మీ నాని సమ్మర్ స్పెషల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 17 వ వార్షికోత్సవ వినాయక చవితి ఉత్సవా నికి శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య హాజరైనారు. మంగళవారం నిర్వహించిన ఉత్సవంలో వినాయక పందిరి నందు ఏర్పాటుచేసిన వినాయక స్వామి ప్రతిమను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందువులకు ఎంతో పవిత్రమైన పండగలలో వినాయక చవితి ఒకటి అని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో వినాయకుని ప్రార్థిస్తే ఆయన కటాక్షంతో సమస్యలు తీరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫోటో ఓటరు జాబితాల ప్రచురణ



**చిలకలూరిపేట, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు మున్సిపల్ పరిపాలన శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు చిలకలూరిపేట పురపాలకసంఘ పరిధిలోని 1వ వార్డు నుండి 48వ వార్డు వరకు ఫోటో ఓటరు జాబితాలను అధికారులు సిద్ధం చేసినట్లు సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు జాబితా ఆధారంగా, 01.01.2026 తేదీని ప్రామాణికంగా (అర్హత తేదీ) తీసుకొని ఈ వార్డుల వారీ జాబితాలను ఫారం-1 నోటీసుతో పాటు అధికారులు ప్రచురించారు. ప్రజల పరిశీలనార్థం ఈ ఫోటో ఓటరు జాబితాలను 22.09.2026 నాడు చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంతో పాటు ఇతర ప్రముఖ ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులలో ప్రదర్శించినట్లు పురపాలకసంఘ కమిషనర్ పతి శ్రీహరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎంఎస్ఎంఈ పార్కుకు స్థల పరిశీలన

**గుంటూరు, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** పొన్నూరు నియోజకవర్గంలో ఎం.ఎస్.ఎం.ఇ పార్కు ఏర్పాటుకు మంగళవారం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర కుమార్ తో కలిసి కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ స్థల పరిశీలన చేశారు. నియోజక వర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆదేశాల జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి,జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ నరసింహారావు, తహసిల్దార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ పీఠంపై పెరుగుతున్న ఆశావాహులు

- కూటమి నుంచి ఆరుగురు, వైసీపీ నుంచి ఒకరు రేసులో
- ప్రత్తిపాటి మనసులో ఎవరి పేరు ఉందో తేలాల్సి ఉంది..!?



**చిలకలూరిపేట, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కసరత్తు వేగవంతం చేస్తున్న తరుణంలో చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు రాజకీయ వేడి రగులుతోంది. కూటమి పార్టీల నుంచి ఆశావాహులు తమ తమ సామాజిక వర్గాల బలాబలాలను నిరూపించుకుంటూ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ నెల చివరినాటికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల సమాచారం. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, మున్సిపల్ చైర్మన్ సీటు దక్కితే పోటీకి సిద్ధమని వివిధ పార్టీల నాయకులు సోషల్ మీడియా వేదికగా, బహిరంగంగా సంకేతాలిస్తున్నారు. ప్రస్తుతం కూటమి తరఫున బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అన్నం శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమకుమార్, జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుల్లి చినబాబు, టీడీపీ నాయకుడు కేతావతు రాములు నాయక్ రేసులో ఉండగా, వైసీపీ (గా=బ్రూ) నుంచి బాణావతు బాలకోటి నాయక్ చైర్మన్ పీఠంపై తీవ్ర ఆసక్తి చూపుతున్నారు.

**రిజర్వేషన్లు, సామాజిక వర్గాల లెక్కలు:**

మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఎస్సీ సామాజిక వర్గానికి చైర్మన్ పీఠం దక్కకపోవడంతో, ఈసారి రిజర్వేషన్ తమకే వస్తుందనే ఆశ ఆ వర్గంలో బలంగా ఉంది. ఒకవేళ ఎస్సీకి కేటాయిస్తే ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆ సామాజిక వర్గంలోని సీనియర్లకు ప్రాధాన్యమిస్తారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు మహిళలకు సీటు కేటాయించే అవకాశం ఉందన్న ప్రచారం కూడా నగరంలో జరుగుతోంది. బీజేపీ తరఫున సీనియర్ నాయకుడు అన్నం శ్రీనివాసరావు, సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన గట్టా హేమకుమార్ పోటీకి ఆసక్తి చూపుతున్నారు. గతంలో ప్రజారాజ్యం నుంచి నేటి జనసేన వరకు పనిచేసి, అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే విజయం కోసం శ్రమించిన తోట రాజా రమేష్ కూడా కూటమి ధర్మంలో చైర్మన్ సీటును ఆశిస్తున్నారు.

**ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సమీకరణాలు**

ఎస్సీ వర్గానికి రిజర్వ్ అయితే మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ఉన్న పిల్లి కోటి లేదా పొలిటికల్ అనుభవజ్ఞుడైన కుల్లి చినబాబు పోటీకి సిద్ధపడుతున్నారు. గతంలో టీడీపీలో పనిచేసి, తాజాగా పోటీ చేస్తానని ప్రకటించిన మూకిరి కోటి పేరు కూడా పరిశీలనలో ఉంది. ఎస్టీ వర్గానికి అవకాశం వస్తే టీడీపీ నుంచి కేతావతు రాములు నాయక్, వైసీపీ నుంచి బాణావతు బాలకోటి నాయక్ పోటీ పడటానికి వ్యూహాలు రచిస్తున్నారు. ఇకపోతే, మైనార్టీ వర్గానికి చెందిన నాయకులు ఇప్పటికే మార్కెట్ యార్డ్ చైర్మన్, పట్టణ అధ్యక్ష పదవుల్లో కొనసాగుతున్నారు. మైనార్టీలకే మళ్లీ ప్రాధాన్యమిస్తే ఇతర సామాజిక వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమయ్యే ప్రమాదం ఉందన్న చర్చ కూడా సాగుతోంది. స్థానిక వార్డుల వారీగా సామాజిక వర్గాల బలాబలాలను బట్టి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని, నోటిఫికేషన్ వచ్చాకే చైర్మన్ అభ్యర్థిపై స్పష్టత వస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# అభివృద్ధికి నమూనా చంద్రబాబు పాలన

**చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పాలన అభివృద్ధికి సరైన నమూనా అని, ప్రజల అవసరాలను ముందే గ్రహించి మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆయనకు ఎవరూ సాటి రారని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో చేపట్టే రూ. 11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి కుప్పం నుండి వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట పురపాలక వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో పాటు మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా చిలకలూరిపేట మున్సిపాలిటీకి రూ. 310 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే కొన్ని పనులు టెండర్ల దశలోనూ, మరికొన్ని పరిపాలనా అనుమతుల మంజూరు దశలోనూ ఉన్నాయని వెల్లడించారు. ఈ నిధులతో సురక్షిత తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, సీసీ కెమెరాలు, పచ్చదనం మరియు సుస్థిర ఘనవ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా క్షేత్రస్థాయి పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఆదేశించారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కేవలం కాగితాలు, ప్రకటనలకే పరిమితమైందని, కనీస రహదారులు, డ్రైనేజీల నిర్వహణ లేక పట్టణ ప్రజలు నానా అవస్థలు పడ్డారని ప్రత్తిపాటి



విమర్శించారు. కూటమి ప్రభుత్వం అమరావతి రాజధానికి దీటుగా రాష్ట్రంలోని పట్టణాల రూపురేఖలు మార్చేందుకు కట్టుబడి ఉందన్నారు. అమృత్, జల్ జీవన్ మిషన్, ఎస్‌బీఎమ్ పథకాల కింద మంజూరైన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అధికారులు, కాంట్రాక్టర్ల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా, పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫానీ, కందుల రమణ, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఇ. అబ్దుల్ రహీమ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఏపీలో క్యాన్సర్ రోగులకు ఊరట

**రూ.75 వేల వరకు ఖర్చయ్యే జన్యు పరీక్షలు ఇక ఉచితం.. గుంటూరు జీజీహెచ్‌లో అధునాతన ల్యాబ్**

**గుంటూరు, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ రోగులకు అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో తొలిసారిగా క్యాన్సర్ రోగులకు అవసరమైన అధునాతన జన్యు పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించేలా గుంటూరు జీజీహెచ్ ప్రాంగణంలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ ల్యాబ్‌కు అవసరమైన పరికరాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు అవసరమైన జన్యు పరీక్షలు నిర్వహించనున్నారు.




**జన్యు మార్పుల గుర్తింపు**

క్యాన్సర్ రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లో ప్రత్యేకంగా పరీక్షించి, క్యాన్సర్ కణాల్లో చోటుచేసుకున్న జన్యు మార్పులను గుర్తిస్తారు. పరీక్షల ద్వారా వచ్చే నివేదిక ఆధారంగా రోగికి ఏ రకమైన చికిత్స అవసరమో వైద్యులు నిర్ణయించేందుకు అవకాశం ఉంటుంది. రోగ నిర్ధారణ నుంచి చికిత్స, అనంతర పర్యవేక్షణ వరకు ఈ విధానాన్ని ఉపయోగించనున్నారు. ఇక బెంగళూరు, ముంబైకి శాంపిల్స్ పంపాల్సిన అవసరం లేదు ప్రస్తుతం క్యాన్సర్ రోగుల జన్యు పరీక్షల కోసం శాంపిల్స్‌ను బెంగళూరు, ముంబై వంటి నగరాల్లోని ల్యాబ్‌లకు పంపాల్సి వస్తోంది. గుంటూరులో ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోనే పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రైవేటు ల్యాబ్‌లలో ఒక్కో జన్యు పరీక్షకు సుమారు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు, పూర్తి స్థాయి పరీక్షలకు సుమారు రూ.75 వేల వరకు ఖర్చయ్యే పరిస్థితి ఉంది. అయితే గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేస్తున్న ల్యాబ్‌లో ఈ పరీక్షలను రోగులకు ఉచితంగా అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంయుక్తంగా ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సెప్టెంబర్ 22న గుంటూరు జీజీహెచ్ ప్రాంగణంలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఈ ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు సమాచారం. అధునాతన జన్యు పరీక్షలు ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే ఉచితంగా అందుబాటులోకి రావడం వల్ల క్యాన్సర్ రోగులకు పరీక్షల ఖర్చు తగ్గడంతో పాటు, చికిత్సను మరింత వ్యక్తిగతీకరించే అవకాశం ఏర్పడనుంది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక

బుధవారం, 23 సెప్టెంబర్ 2026

# రాగూర్ సినిమా సీన్ రీ-క్రియేట్ చేశారంటూ వైద్యులపై ఆరోపణలు

## మృతురాలికి చికిత్స చేసినట్లు నటించారంటూ కుటుంబ సభ్యుల ఆందోళన



**గుంటూరు, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** మృతిచెందిన మహిళకు వైద్యం కొనసాగించినట్లు చూపించారంటూ ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వైద్యులు, ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శిరిపురం గ్రామానికి చెందిన నూర్ బాషా రంజాన్ బిని కాన్పు కోసం జోషిత తల్లి పిల్లల వైద్యశాలలో చేర్పించినట్లు ఆమె తల్లి అల్లాబీ తెలిపారు. ప్రసవంతో పాటు ట్యూబెక్టమీ ఆపరేషన్‌కు సంబంధించి రూ.లక్షకు మాట్లాడుకుని వైద్యం చేయించామని ఆమె పేర్కొన్నారు. అయితే ఆపరేషన్ అనంతరం తన కుమార్తె పరిస్థితి విషమించి మృతిచెందిందని అల్లాబీ ఆరోపించారు. తన కుమార్తె మృతిచెందిన విషయం తమకు తెలియజేయకుండా, ఇంకా చికిత్స కొనసాగుతున్నట్లు చూపిస్తూ జోషిత ఆసుపత్రి నుంచి శ్రేష్ఠ హాస్పిటల్‌కు తరలించారని ఆమె ఆరోపించారు. శ్రేష్ఠ హాస్పిటల్‌లోనూ వైద్యం అందిస్తున్నట్లు చూపిస్తూ డబ్బులు తీసుకున్నారని అల్లాబీ ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నించినందుకు తనపైనే కేసు పెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించిన దళిత సంఘాల నాయకుడు కంభంపాటి ఆనంద్, రంజాన్ బి మృతిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మృతురాలికి చికిత్స అందించినట్లు వ్యవహరించిన వైద్యులు, సంబంధిత ఆసుపత్రులపై వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి, తప్పిదం నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనపై నిష్పక్షపాత విచారణ నిర్వహించాలని ధర్నాలో పాల్గొన్న బాధిత కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



# క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపునకు అత్యాధునిక సేవలు

- గుంటూరు జీజీహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ జీనోమిక్ సీక్వెన్సింగ్ సెంటర్ ప్రారంభం
- ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత చికిత్స: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**గుంటూరు, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ, నిర్ధారణ, మెరుగైన చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో వైద్య రంగాన్ని క్యూరేటివ్, రియాక్టివ్ విధానం నుంచి ప్రోయాక్టివ్, ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, వెల్‌నెస్ విధానం వైపు తీసుకెళు
_న్నామని చెప్పారు. గుంటూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (GGH)లో ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్.ఏఐ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ జీనోమిక్ సీక్వెన్సింగ్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. జీనోమిక్ సీక్వెన్సింగ్ ద్వారా జన్యుపరమైన వ్యాధులను ముందస్తుగానే గుర్తించడంతో పాటు, కుటుంబంలో భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే అవకాశాలను అంచనా వేసి తగిన నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. దేశంలో క్యాన్సర్ కేసులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో.. మాలిక్యులర్ డయాగ్నోసిస్, జీనోమిక్స్, క్లినికల్ రీసెర్చ్, పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించి ఇప్పటివరకు సుమారు 2.65 కోట్ల మందికి ఉచిత స్క్రీనింగ్ పూర్తి చేశామని, ఈ ప్రక్రియలో ఆశా కార్యకర్తల నుంచి సూపర్ స్పెషలిస్టుల వరకు 18 వేల మంది ఆరోగ్య సిబ్బందిని భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు.

### రూ.25 లక్షల ఉచిత వైద్యం.. జిల్లాల్లో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలు:

క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆసుపత్రులు మరియు నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకు ఉచిత చికిత్స అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కర్నూలులో రూ.120 కోట్లతో స్టేట్ క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభించామని, కడప, విశాఖపట్నం, అనంతపురం, కాకినాడలలో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని జీజీహెచ్‌లలో ఈ సేవలను విస్తరిస్తామన్నారు. జీజీహెచ్‌లో జీనోమిక్ సీక్వెన్సింగ్ సెంటర్ అందుబాటులోకి రావడంతో గతంలో హైదరాబాద్, బెంగళూరు పంపాల్సి వచ్చిన రూ.20 వేల నుంచి రూ.25 వేల విలువైన జన్యు పరీక్షలను స్థానికంగానే ఉచితంగా అందించే అవకాశం ఏర్పడిందన్నారు.

### క్యాన్సర్ చికిత్సలో నూతన అధ్యాయం:

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్యాన్సర్ సంరక్షణను బలోపేతం చేయడంలో జీనోమిక్ సీక్వెన్సింగ్ సెంటర్ ప్రారంభం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్ కేసుల్లో జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా క్యాన్సర్ వేరియంట్‌ను గుర్తించి, వ్యక్తిగత చికిత్స (ప్రెసిషన్ ఆంకాలజీ) అందించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. భవిష్యత్తులో అమరావతి బయో వ్యాలీలో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ వైద్యులు, కళాశాల అధ్యాపకులు, వైద్య విద్యార్థులు మరియు సంబంధిత సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




# మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

### ఈగల్ ఎస్ఐ సునీల్ బాబు

**యర్రబాలెం, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** మాదకద్రవ్య రహిత సమాజమే తమ ప్రధాన లక్ష్యమని ఈగల్ ఎస్ఐ సునీల్ బాబు తెలిపారు. మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థ (ఎంటీఎంసీ) పరిధిలోని యర్రబాలెంలో మంగళవారం నిర్వహించిన 'పల్లెబాటలో ఈగల్' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలను గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అడ్డాలుగా మార్చేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్ఐ సునీల్ బాబు వెల్లడించారు. యువతను మాదకద్రవ్యాలకు బానిసలుగా మార్చే వ్యక్తులు, ముఠాల సమాచారాన్ని ప్రజలు భయం లేకుండా అధికారులకు అందించాలని కోరారు. గంజాయి రవాణా, విక్రయాలు లేదా నిల్వకు సంబంధించిన ఏ చిన్న సమాచారం తెలిసినా వెంటనే ఈగల్ 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతామని, ప్రజల భాగస్వామ్యం, సహకారంతోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, నీలం అంకారావు, ఆకుల పానకాలరావు, గడదాసు రంగారావు, ఫిరోజ్ ఖాన్, ఈగల్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, రోసిబాబు, కిరణ్, మహిళా పోలీసు కానిస్టేబుళ్లు శ్రీవాణి, అరుణ మరియు సచివాలయ ఉద్యోగులు నాయక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తాడికొండ అనుమానాస్పద మృతి కేసులో సిట్ ఏర్పాటు

### అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నివేదిక ఆధారంగా చర్యలు

### గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** తాడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అనుమానాస్పద మృతి (సస్పిషియస్ డెత్) కేసులో సమగ్ర దర్యాప్తు కోసం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేసులో వాస్తవాలను వెలికితీసేందుకు శాస్త్రీయ మరియు నిష్పక్షపాత పద్ధతిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సిట్ ఇన్‌చార్జ్‌గా అదనపు ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.టి.వి. రవికుమార్ వ్యవహరించనుండగా, సభ్యులుగా గుంటూరు సౌత్ డీఎస్పీ జి. పూర్ణచంద్రరావు, పొన్నూరు రూరల్ సీఐ కృష్ణయ్య, అరండల్‌పేట ఎస్ఐ అశోక్ నియామకమయ్యారు. ఎఫ్ఐఆర్ నంబర్ 145/2026, సెక్షన్ 194 బీఎన్ఎస్ కింద నమోదైన ఈ కేసులో మృతుడు చీకటి గోపి మృతికి సంబంధించిన అసలు నిజాలను బయటకు తీసుకురావడానికి సిట్ బృందం రంగంలోకి దిగింది. ఘటనా స్థల పరిశీలనతో పాటు సీసీటీవీ ఫుటేజ్, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, పోస్టుమార్టం మరియు ఫోరెన్సిక్ వైద్య నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఇప్పటికే సేకరించిన ఆధారాలను కూడా పునఃసమీక్షించి, అవసరమైన అదనపు సాక్ష్యాలను సేకరిస్తామని అధికారులు తెలిపారు. ఎలాంటి ముందస్తు అభిప్రాయాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు పూర్తి చేసి సిట్ అందించే నివేదిక ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు.




# సాంకేతికతతో నేరాల కట్టడి

### సెంట్రలైజ్డ్ డ్రోన్ మానిటరింగ్ పోర్టల్, 'సేఫ్ స్టే ఏపీ' యాప్ ప్రారంభం

**గుంటూరు, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, పోలీసు నిఘాను మరింత పటిష్టం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తోంది. ఈ దిశగా రాష్ట్ర డీజీపీ శ్రీ హరిష్ కుమార్ గుప్తా ఐపీఎస్ సెంట్రలైజ్డ్ డ్రోన్ మానిటరింగ్ పోర్టల్‌తో పాటు 'సేఫ్ స్టే ఏపీ' యాప్‌ను ప్రారంభించారు. సెంట్రలైజ్డ్ డ్రోన్ మానిటరింగ్ పోర్టల్ ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పోలీసు శాఖ వినియోగిస్తున్న డ్రోన్ల సమాచారాన్ని ఒకే వేదికపై పర్యవేక్షించే అవకాశం కల్పించారు. గుంటూరు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసులు ప్రత్యక్షంగా చేరుకోలేని ప్రాంతాల్లో కూడా డ్రోన్ల ద్వారా సమర్థవంతమైన నిఘా నిర్వహించవచ్చని తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంతో పాటు డీజీపీ కార్యాలయానికి కూడా ఈ వ్యవస్థను అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. ఈ పోర్టల్ ద్వారా ఒకేసారి సుమారు 2,000 డ్రోన్ల కార్యకలాపాలను పర్యవేక్షించే సామర్థ్యం ఉందని చెప్పారు. భద్రతా పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రత్యేక ఆపరేషన్లు, జనసమూహాల నిర్వహణ, విపత్తుల సమయంలో పర్యవేక్షణ వంటి అంశాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. నగరాలు, పట్టణాల్లోని హోటళ్లలో బస చేసే వ్యక్తుల సమాచారాన్ని డిజిటల్ రూపంలో పోలీసులకు అందించేందుకు 'సేఫ్ స్టే ఏపీ' యాప్‌ను రూపొందించినట్లు ఎస్పీ తెలిపారు. గతంలో హోటళ్లలో బస చేసే వారి వివరాలను రిజిస్టర్ల ద్వారా సేకరించేవారని, ఇప్పుడు యాప్ ద్వారా వేగంగా, పారదర్శకంగా సమాచారాన్ని పోలీసు శాఖకు అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి హోటల్ యాజమాన్యం 'సేఫ్ స్టే ఏపీ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ హోటల్‌లో బస చేసే అతిథుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ వ్యవస్థ ద్వారా నగరానికి వచ్చే ప్రయాణికుల భద్రత మెరుగుపడటంతో పాటు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడంలో కూడా పోలీసులకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. గుంటూరు జిల్లాలో నేరాలను అరికట్టేందుకు డ్రోన్లు, డిజిటల్ యాప్‌లు, ఆధునిక నిఘా వ్యవస్థలను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. సాంకేతికత ఆధారిత పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత భద్రత కల్పించడం, నేరాలను ముందుగానే గుర్తించి అరికట్టడం సాధ్యమవుతుందని తెలిపారు.

# డీఎస్సీ అక్రమాల సాక్ష్యాలు చూపించేందుకు వెళ్లడమే హత్యాయత్నమా?: బలసాని

**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 23 (స్పంద న్యూస్):** డీఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను అధికారులకు చూపించేందుకు విజయవాడ శాప్ (రాయ్యాప్రా) కార్యాలయానికి శాంతియుతంగా వెళ్లిన వైసీపీ నాయకులను పోలీసులు దౌర్జన్యంగా అదుపులోకి తీసుకోవడమే కాకుండా, తిరిగి వారిపైనే హత్యాయత్నం కేసులు నమోదు చేయడం దారుణమని వైసీపీ నాయకుడు బలసాని కిరణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాల ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులను రోడ్లపై ఈడ్చుకెళ్లారని ఆరోపించారు. ప్రభుత్వం వద్దకు వచ్చి ఆధారాలు చూపిస్తామని చెబితే వినాల్సింది పోయి, ప్రశ్నించే గొంతుకలను భయభ్రాంతులకు గురిచేసేలా అణచివేత చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. రాజ్యాంగబద్ధంగా నిరసన తెలిపితే అక్రమ కేసులు పెట్టడం, ఆధారాలు ఇస్తామన్నా హత్యాయత్నం కేసులు నమోదు చేయడం ఏ రకమైన పాలన అని నిలదీశారు. డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం సాకులు చెప్పకుండా తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తాము లేవనెత్తుతున్న ఆరోపణలు, సాక్ష్యాలను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని, ప్రశ్నించిన వారిపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని బలసాని కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# నరసరావుపేట మున్సిపాలిటీకి వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

### మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గొదా జాన్‌పాల్ డిమాండ్



**నరసరావుపేట, సెప్టెంబర్ 22 (స్పంద న్యూస్):** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట మున్సిపాలిటీకి స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణమే నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గొదా జాన్‌పాల్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఇక్కడి రాజకీయ పార్టీలు, నాయకులు కోర్టుల్లో కేసులు వేయడం కారణంగా నరసరావుపేట మున్సిపాలిటీకి ఎన్నికలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల దాదాపు 92 వేల మంది ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పట్టణంలో విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలు పేరుకుపోయి అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు ఉన్నప్పుడే ప్రజలు తమ సమస్యలను చెప్పుకోగలుగుతారని, అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు సక్రమంగా సద్వినియోగమై పట్టణం అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సందిగ్ధతకు తెరదించి, కోర్టు సమస్యలను పరిష్కరించి తక్షణమే నరసరావుపేట మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.